www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
కరీంనగర్ | సంపుటి : 02 | సంచిక : 290 | గురువారం | 17 ఏప్రిల్, 2025

## వ్యవసాయరంగంలో
# ఏఐ వినియోగం

**చీడపీడులు, ప్రకృతి వైపరీత్యాల్లో రైతులకు హెచ్చరిక**

**అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

వ్యవసాయ రంగంలో ఏఐ వినియోగం చాలా అవసరమని, ఈ దిశా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు , డైరెక్టర్ గోపి తదితరులతో సచివాలయంలో మంత్రి సమీక్షించారు.



02






## కంచ గచ్చిబౌలి భూములపై
# సుప్రీం సీరియస్

## వర్సిటీ భూములపై సర్కార్‌కు చెంపదెబ్బ

- సుప్రీం మార్గదర్శకాలు విస్మరించి చెట్ల నరికివేతపై ఆగ్రహం
- ఆ భూముల్లోనే తాత్కాలిక జైలు నిర్మించి అధికారులను వేస్తాం
- నాలుగు వారాల్లో పునరుద్ధరణ నివేదిక సమర్పించాలని ఆదేశం
- స్టేటస్‌కో కొనసాగుతుందని వెల్లడి..
- విచారణ మే 15కు వాయిదా

**న్యూఢిల్లీ,ఏప్రిల్16 :** కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీం కోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చెట్ల నరికివేతపై రేవంత్ సర్కార్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి నిలదీశారు. సీఎస్‌ను కాపాడాలని అనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలని అన్నారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి

మిగతా 2 లో



## గచ్చిబౌలి భూములపై వీడియో షేర్

**సీనియర్ అధికారి స్మితాకు పోలీసుల నోటీసులు**

02

## దేశాన్ని లూటీ చేసిన నెహ్రూ కుటుంబం



- దేశాన్ని అవినీతమయంగా చేశారు
- కాంగ్రెస్ హయాంలోనే నేషనల్ హెరాల్డ్ కేసు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు

నెహ్రూ కుటుంబం దేశాన్ని లూటీ చేసిందని.. అంతేకానీ.. దేశానికి ఆ కుటుంబం ఏం చేయలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఆ క్రమంలో దేశాన్ని అవినీతిమయంగా మార్చిన విషయం మనం చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నేషనల్ హెరాల్డ్ కేసు వచ్చిందని గుర్తు చేశారు.

03




## వక్ఫ్ రాజ్యాంగ బద్ధతపై సుప్రీం విచారణ

**స్టే ఇవ్వడానికి సుప్రీం ధర్మాసనం నిరాకరణ**

**విచారణ నేటికి వాయిదా వేసిన ధర్మాసనం**

02



03

## 15మందితో గద్దర్ అవార్డుల జ్యూరీ కమిటీ

**చైర్‌పర్సన్‌గా జయసుధ నియామకం**

## కూలిస్తే కూలిపోయే ప్రభుత్వం కాదు

**మోడీకి భూములపై తప్పుడు సమాచారం**

**స్మితా సబర్వాల్ వ్యవహారంపై చట్టప్రకారం వెళతాం: శ్రీధర్ బాబు**



కూలిస్తే కూలిపోయే ప్రభుత్వం కాదని, మోడీకి భూములపై తప్పుడు సమాచారం ఇచ్చారని, స్మితా సబర్వాల్ వ్యవహారంపై చట్టప్రకారం వెళతామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

02




## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

కాంగ్రెస్ పర్యావరణ విధ్వంసాన్ని గుర్తించిన ధర్మాసనం మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

02

**సుప్రీం తీర్పును స్వాగతించిన బీఆర్ఎస్**

ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్న కేటీఆర్



## పాఠశాల వంటగదిలో విష ప్రయోగం

**30 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు**

**నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వెల్లడి**

ఆదిలాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విష ప్రయోగం జరిగింది. విద్యార్థులు తాగే నీటి ట్యాంక్‌లో దుండగులు పురుగుల మందు కలిపారు. మధ్యాహ్న భోజన సామగ్రిపై కూడా పురుగుల మందులు చల్లారు.

- ప్రజానావ, ఆదిలాబాద్



03



02


## తెలంగాణలో రాగల మూడ్రోజులు వర్షాలు

**ఈదురుగాలులతో వానలు పడే అవకాశం**

## అక్రమ వలసదారులకు ట్రంప్ బంపర్ ఆఫర్

**స్వీయ బహిష్కరణ పథకం అందచేస్తామని ప్రకటన**

**విమాన ఖర్చులతో పాటు, దారి బత్తెం ఇస్తామని వెల్లడి**



03

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# వర్సిటీ భూములపై సర్కార్‌కు చెంపదెబ్బ

# సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

### కాంగ్రెస్ పర్యావరణ విధ్వంసాన్ని గుర్తించిన ధర్మాసనం

### మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి

**ప్రజానావ, హైదరాబాద్ :** కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు–. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ– తన రిపోర్టుతో కళ్లు తెరిపించింది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైంది. ఈరోజు కూడా అదే జరిగింది. విధ్వంసమే విధానంగా సాగుతున్నది రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన.. నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం. నేడు బుల్‌డోజర్లతో పర్యావరణ హననం. మాకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉంది. అందుకే బాధ్యతగా బిఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ–కి నివేదిక ఇచ్చాం. ఆధారాలతో సహా వాస్తవాలు వివరించాం. వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లు–గా తయారైన రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలి అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.


## సుప్రీం తీర్పును స్వాగతించిన బీఆర్ఎస్

### ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలన్న కెటిఆర్

**ప్రజానావ, హైదరాబాద్ :** కంచె గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు ఆదేశాలను భారత రాష్ట్ర సమితి స్వాగతం తెలిపింది.ఇది ప్రభుత్వానికి గుణపాఠం కావాలని అన్నారు. కంచ గచ్చిబౌలిలో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు వన్యప్రాణులను కాపాడాలంటూ ఆదేశాలు ఇవ్వడం గొప్ప విజయమని పేర్కొన్నారు.. వన్యప్రాణుల పట్ల, పర్యావరణ పరిరక్షణకు పాటుపడే ప్రతి ఒక్కరికి దక్కిన విజయం అంటూ పేర్కొన్నారు. గొంతులేని మూగజీవాల కోసం, చెట్ల కోసం, పర్యావరణం కోసం అండగా నిలబడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికారిక కమిటీ ఇచ్చిన సిఫార్సులను కూడా భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తున్నదని పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిని ప్రైవేట్ పార్టీకి తాకట్టు పెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వ వ్యవహారంలో ఆర్థిక అవకతవకలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేసిన కేంద్ర సాధికారిక కమిటీ– మా పార్టీ వాదనను బలపరుస్తున్నదని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూముల తాకట్టు– విషయంలో పదివేల కోట్ల రూపాయల అవినీతికి రేవంత్ రెడ్డి పాల్పడ్డారని చేసిన ఆరోపణలను పునరుద్ఘాటించారు. అడవుల పట్ల, వన్యప్రాణుల పట్ల రేవంత్ రెడ్డి నెంబర్ వన్ విలన్‌గా మారాడని విమర్శించారు. పర్యావరణ విధ్వంసానికి... పర్యావరణ హత్యకు పాల్పడి తప్పించుకోలేరనే కనీస సోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇకనైనా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసారు సీఎం రేవంత్ రెడ్డి తనను తాను మోసం చేసుకున్న విషయాన్ని అర్థం చేసుకుని పర్యావరణ విధ్వంసం ఆపాలని కోరారు.

## గచ్చిబౌలి భూములపై వీడియో షేర్

### సీనియర్ అధికారి స్మితాకు పోలీసుల నోటీసులు




**ప్రజానావ, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ స్మితా సబర్వాల్‌కి రాష్ట్ర పోలీసుల నుంచి నోటీసు అందింది. దీనికి కారణం స్మితా సబర్వాల్ సామాజిక మాధ్యమాల్లో కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాల అడవి ధ్వంసానికి సంబంధించిన ఓ ఏఐ రూపొందించిన చిత్రం షేర్ చేయడమే. ఈ చిత్రం మార్చి 31న 'సోషల్ మీడియా హ్యాండిల్ నుంచి షేర్ చేయబడింది. ఇది మష్రూమ్ రాక్ వద్ద బుల్‌డోజర్లు, వాటిని చూస్తున్న నెమలి, జింక లాంటి జంతువులతో జిబ్లి స్టైల్‌లో రూపొందించబడినదిగా ఉంది. హైదరాబాద్ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని చిత్రంలో చూపించారు. ఈ విషయమై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లా ఖాన్ మాట్లాడుతూ.. భారతీయ నాగరిక సురక్షా సంహిత లోని సెక్షన్ 179 ప్రకారం స్మితా సబర్వాల్‌కు నోటీసు జారీ చేసినట్లు–తెలిపారు. అయితే, నోటీసులో పేర్కొన్న విషయాలను ఇప్పుడే బయటపెట్టలేమని స్పష్టం చేశారు. సెక్షన్ 179 ప్రకారం కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసు అధికారి, సంబంధిత వ్యక్తులను స్టేట్‌మెంట్ ఇవ్వాలంటూ స్టేషన్‌కు హాజరయ్యేలా పిలిచే అధికారం కలిగి ఉంటాడు. ఈ నిబంధనల ఆధారంగానే స్మితాకు నోటీసు పంపినట్లు– తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రజా చైతన్యాన్ని కలిగించే భాగంలో ఉన్న ఒక అధికారికి నోటీసు రావడం పట్ల అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏఐ చిత్రాన్ని షేర్ చేయడం వల్ల నేరపూరిత చర్యలకు దిగడమేంటన్న ప్రశ్నలు కూడా తెరపైకి వచ్చాయి.


మొదటి పేజీ తరువాయి


వరకు స్టేటస్ కో కొనసాగుతుందని అన్నారు.

కంచ గచ్చిబౌలి భూముల అంశంపై జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెట్లు కొట్టివేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వ తరఫున లాయర్ స్పందిస్తూ జామాయిల్ తరహా చెట్లు–, పొదలను అనుమతి తీసుకునే తొలగించామని తెలిపారు. అందుకు చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. వారంతపు సెలవుల్లో మూడు రోజుల్లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. మీరు చెట్లు కొట్టడం వల్ల అక్కడ జంతువుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయని.. ఆ వీడియోలను చూసి ఆందోళనకు గురయ్యామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే 2400 ఎకరాల్లో ఒక్క చెట్టు కూడా కొట్టకుండా ఆదేశాలివ్వాల్సి వస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకోమని జస్టిస్ గవాయి హెచ్చరించారు. భూముల మార్టిగేజ్‌తో తమకు సంబంధం లేదని.. చెట్ల నరికివేత గురించే తాము మాట్లాడుతున్నామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అడవులు లేవని వాదిస్తే.. అదే ప్రాంతంలో జైలు కట్టి అందులోనే అధికారులను పెట్టాల్సి ఉంటుందని జస్టిస్ బీఆర్ గవాయి హెచ్చరించారు. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అన్నదే ముఖ్యమని తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లు– కొట్టేసినందుకు సీఎస్ సహా అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎస్‌ను కాపాడాలనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. పునరుద్ధరణ ఎలా చేస్తారు? ఎంతకాలంలో చేస్తారు? జంతు జాలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని, దాని ప్రకారం స్వయం అనుమతులుగా ప్రభుత్వం వ్యవహరిం చిందని అమికస్ క్యూరీ సుప్రీంకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడటానికి మేము ఇక్కడ ఉన్నాం. అధికారుల



అనుమతి లేకుండా ఎన్ని చెట్లను నరికివేశారో అనే ఆందోళన మాత్రమే ఉంది. చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలి. మేము బుల్డోజర్ ఉనికి, 100 ఎకరాల అడవిని తొలగించడం గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నాం. మీరు నిర్మించాలనుకుంటే, మీరు అనుమతులు తీసుకొని ఉండాలి అని జస్టిస్ అన్నారు. 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి, తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి, ఐటి పార్కు, ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన వివారలను కోర్టుకు చెప్పారు. అయితే వంద ఎకరాల్లో జరిగిన నష్టాన్ని ఎలా పూడ్చాలన్న విషయం పైనే మేము దృష్టి సారించాలని అంటున్నామని జస్టిస్ గవాయ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం.ఆ భూముల్లో ఉన్న జంతుజాలాన్ని ఎలా సంరక్షిస్తారో చెప్పాలన్నారు. ఆర్టికల్ 142 కింద పర్యావరణ పరిరక్షణ కోసం ఏమైనా చేస్తాం. పునరుద్ధరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తే, మీ అధికారులను తాత్కాలికంగా జైలుకు పంపిస్తాం అని కఠినంగానే అన్నారు. 100 ఎకరాల్లో జరిగిన నష్టం కారణంగా ప్రభావితమైన వన్యప్రాణులను రక్షించేందుకు అవసరమైన తక్షణ చర్యలను పరిశీలించి, అమలులోకి తీసుకురావాలని తెలంగాణ వన్యప్రాణి సంరక్షణాధికారిని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. పునరుద్ధరణ ఎలా చేస్తారు, ఎంత కాలంలో చేస్తారు, జంతు జలాన్ని ఎలా సంరక్షిస్తారో స్పష్టంగా చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది ధర్మాసనం. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశాల్లో పేర్కొంది. తదుపరి విచారణను మే 15కు సుప్రీం కోర్టు వాయిదా వేసింది.

## వక్ఫ్ రాజ్యాంగ బద్ధతపై సుప్రీం విచారణ

### స్టే ఇవ్వడానికి సుప్రీం ధర్మాసనం నిరాకరణ

### విచారణ నేటికి వాయిదా వేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ,ఏప్రిల్16 :** వక్ఫ్ సవరణ చట్టం–2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై బుధవారం విచారణ జరిగింది. వక్ఫ్ చట్టంపై స్టే విధించేందుకు సుప్రీం నిరాకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ముగ్గురుసభ్యుల ధర్మాసనం వాటిని విచారించింది. వక్ఫ్ చట్టరూపాన్ని ఆర్టికల్ 26 నిరోధించదని, ఆ రాజ్యాంగ నిబంధన సార్వత్రికమైందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అందరికీ వర్తించే ఈ నిబంధన లౌకికమైన స్వభాన్ని కలిగిఉందని చెప్పింది. అలాగే కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించింది. ఈ మేరకు నోటీసులు జారీచేసింది. వందల ఏళ్లనాటి ఆస్తులకు పత్రాలు ఎక్కడినుంచి వస్తాయని ప్రశ్నించింది. వక్ఫ్ చట్టంపై ఆందోళనల్లో హింస చోటుచేసుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్ సిబల్ అత్యున్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ఈ చట్టం జాతీయస్థాయి పరిణామాలను కలిగి ఉందని, ఈ పిటిషన్లను హైకోర్టుకు రిఫర్ చేయొద్దని మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. వక్ఫ్ బై యూజర్ అనేది ఎప్పటినుంచో అమల్లో ఉన్న పద్ధతి అని మరో న్యాయవాది హుజేఫా అహ్మదీ వెల్లడించారు. మరోపక్క.. ప్రభుత్వం ఏర్పాటు– చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ వక్ఫ్ బిల్లుపై విస్తృత చర్చ జరిపిందని కేంద్రం కోర్టుకు వెల్లడించింది. అనంతరం కోర్టు విచారణను రేపటికి వాయిదా వేసింది. ఇటీవల పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి వచ్చింది. ఇటీవల మోదీ సర్కారు ఆమోదించిన వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల పై సుప్రీం కోర్టు విచారణ ప్రారంభించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో 10 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్, టీఎంసి ఎంపీ మహువా మొయిత్ర, ఎస్పీ ఎంపీ జియా ఉర్ రెహమాన్, అర్జేడి ఎంపీ మనోజ్ కుమార్ ఝ, ఆప్ ఎమ్మెల్యే అమనాతుల్లా ఖాన్, మణిపూర్ ఎమ్మెల్యే షేక్ నూరుల్ హాసన్, వైసీపీ, డిఎంకె, టీవికే అధినేత విజయ్, సిపిఐ సహా కొన్ని ముస్లిం సంఘాలు ఉన్నాయి. ఇక, పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. మరోవైపు వక్ఫ్ బోర్డు సవరణ చట్టంను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు ముందు తమ వాదనలు కూడా వినాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. పిటిషన్లు దాఖలు చేసిన రాష్ట్రాల్లో అస్సాం, రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. వీరంతా ఈ చట్టాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇక, కపిల్ సిబాల్ వాదనల ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాలలో తలదూర్చారని కపిల్ సిబాల్ అత్యున్నత న్యాయంస్థానం ముందుకు తీసుకెళ్లారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని కపిల్ సిబాల్ అన్నారు.

## వ్యవసాయరంగంలో ఎఐ వినియోగం

### చీడపీడులు,ప్రకృతి వైపరీత్యాల్లో రైతులకు హెచ్చరిక

### అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజానావ, హైదరాబాద్:** వ్యవసాయ రంగంలో ఎఐ వినియోగం చాలా అవసరమని, ఈ దిఘా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు , డైరెక్టర్ గోపి తదితరులతో సచివాలయంలో మంత్రి సమీక్షించారు. ఈ సంవత్సరం చేపట్టబోయే వివిధ పథకాలలో సాంకేతికత వినియోగించే దిశగా వివిధ సాంకేతిక కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రివర్యులు మాట్లాడుతూ పంటలలో చీడపీడలను ముందుగానే గుర్తించి, రైతులను ముందుగానే అలర్ట్ ఇవ్వడం, ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు జరిగే పంటనష్టంపై త్వరితగతిన అంచనావేయడం, పంటల కొనుగోళ్లకు సంబంధించి ముందుగానే దిగుబడులు అంచనా వేయడం అదేవిధంగా నమోదైన సాగువిస్తీర్ణాలను ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా సరిపోల్చడం, ఇలా ప్రతీ అంశములోను ఏ.ఐ ని వాడుకొనే దిశలో తమ ప్రభుత్వం ఆలోచిస్తుందని, ఆ దిశగా సాంకేతికతను జోడించి రైతులకు మేలు చేసే సాంకేతిక కంపెనీలతో తమ ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని తెలియజేశారు. అదేవిధంగా ఉపగ్రహ ఛాయాచిత్రాల డాటాను వివిధ అవసరాలకు వాడుకొనే విధంగా వ్యవసాయ మరియు ఉద్యాన విశ్వవిద్యాలయాల ను కూడా భాగస్వాములను చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి హాజరైన ఇక్రిశాట్ మరియు అగ్రివాస్ కంపెనీ ప్రతినిధులు వివిధ రాష్ట్రాలలో సాంకేతికతను వినియోగించి వారు అమలు చేస్తున్న పథకాలను తెలియజేశారు. వ్యవసాయకార్యదర్శి గారు మాట్లాడుతూ, ఆయా కంపెనీలు సాంకేతిక సామార్థం, అమలు తీరు మరియు అవసరమయ్యే నిధులు, రైతులకు కలిగే ప్రయోజనం గురించి సమర్పించాల్సిందిగా ఆదేశించారు. గౌరవ వ్యవసాయశాఖ మంత్రి వర్యులు మాట్లాడుతూ అన్నింటిని పరిశీలించి గౌరవ ముఖ్యమంత్రి గారి ఆమోదం మేరకు సదరు కంపెనీలతో కల్సి పనిచేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలియజేశారు.

## కూలిస్తే కూలిపోయే ప్రభుత్వం కాదు

### మోడీకి భూములపై తప్పడు సమాచారం

### స్మితా సబర్వాల్ వ్యవహారంపై చట్టప్రకారం వెళతాం: శ్రీధర్ బాబు

**ప్రజానావ, హైదరాబాద్ :** కూలిస్తే కూలిపోయే ప్రభుత్వం కాదని, మోడీకి భూములపై తప్పుడు సమాచారం ఇచ్చారని, స్మితా సబర్వాల్ వ్యవహారంపై చట్టప్రకాం వెళతామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టే చెప్పిందన్నారు. గతంలోనే తాము సుప్రీం ఆదేశాలకు కట్టుబడి ఉంటామని చెప్పామన్నారు. అయితే ఈ విషయంలో విపక్ష బిఆర్ఎస్, బిజెపిలు అనవసర రాద్దాంతం చేస్తున్నాయని అన్నారు. బుధవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్ర భాజపా నేతలు ఇచ్చిన తప్పుడు సమాచారంతోనే ఈ భూములపై ప్రధాని మోదీ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారు. కూలగొడితే కూలిపోయే ప్రభుత్వం కాదు మాదని శ్రీధర్‌బాబు అన్నారు.నకిలీ వీడియోస్, ఫొటోలు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. భూముల విషయం కోర్టుల పరిధిలో ఉన్నందున ఏమీ మాట్లాడలేం అన్నారు. ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన పోస్టుపై చట్టప్రకారం ముందుకు వెళ్తామన్నారు. నెమళ్లు జనావాసాల్లోకి రావడం సర్వసాధారణం. ఆ భూముల్లో కూడా ఇలాగే వచ్చాయి అన్నారు. భాజపా, భారాస కలిసే కుట్ర పన్నుతున్నట్లు భావిస్తున్నాం.

# దేశాన్ని లూటీ చేసిన నెహ్రూ కుటుంబం

**దేశాన్ని అవినీతమయంగా చేశారు**

**కాంగ్రెస్ హయాంలోనే నేషనల్ హెరాల్డ్ కేసు**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు**



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 :** నెహ్రూ కుటుంబం దేశాన్ని లూటీ చేసిందని.. అంతేకానీ.. దేశానికి ఆ కుటుంబం ఏం చేయలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఆ క్రమంలో దేశాన్ని అవినీతిమయంగా మార్చిన విషయం మనం చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నేషనల్ హెరాల్డ్ కేసు వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీతోపాటు- ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై మంత్రి జి.కిషన్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో బొగ్గు, హెలికాప్టర్, బోఫోర్స్ కుంభకోణాలు లాంటివి ఎన్నో జరిగాయన్నారు. ఆ క్రమంలో జరిగిన మరో పెద్ద కుంభకోణమే నేషనల్ హెరాల్డ్ అని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు నేషనల్ హెరాల్డ్ స్థాపిస్తే.. దానిని దొడ్డి దారిన సోనియా, రాహుల్ గాంధీలకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీకి తరలించారని విమర్శించారు. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడం సిగ్గు మాలిన చర్య అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. 2012లో నేషనల్ హెరాల్డ్ ఆస్తులపై దర్యాప్తు జరపాలంటూ సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారన్నారు. అందులోభాగంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఆయన కేసు వేశారని తెలిపారు . అయినా.. కాంగ్రెస్ పార్టీ ఎందుకు ధర్నాలు చేస్తుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వీరికి భయపడి కేసులు వెనక్కి తీసుకోవాలా? అని పార్టీని సూటిగా ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం దర్యాప్తు జరపాలని చెప్పిందని గుర్తు చేశారు. చేసిన తప్పులకు చెంపలు వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఆయన సూచించారు. ప్రజలను తప్పుదారి పట్టించడంతోపాటు ఈడి కార్యాలయాల ముందు ధర్నా చేయడం మానుకోవాలని వారికి హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుంభకోణాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని, సుప్రీంకోర్టు, హైకోర్టును తప్పుపట్టడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ కేసులు ఎందుకు వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఆయన డిమాండ్ చేశారు. చట్టానికి వీరేమైనా చుట్టాలా అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఎందుకు ధర్నా చేస్తున్నారంటూ మండిపడ్డారు. తప్పు జరగలేదని కాంగ్రెస్ పార్టీ భూకయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసు కొట్టేయాలంటూ సుప్రీంకోర్టు,హైకోర్టు ఎందుకు వెళ్ళారని ఆయన ప్రశ్నించారు. ఇలా వెళ్లడం రాజ్యాంగబద్ధమైన సంస్థలను అవహేళన చేయడమేనని పేర్కొన్నారు. సోనియా, రాహుల్ గాంధీలు దేశం కోసం చేసిన పనులు కావన్నారు. వీరు బహిరంగ అవినీతికి పాల్పడ్డారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లను ఛార్జిషీట్‌లో ఈడీ పెట్టింది. ఈ కేసును ఏప్రిల్ 25వ తేదీన విచారణ జరపనున్నట్లు- ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. అయితే ఇదే కేసులో ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటలకే సోనియా, రాహుల్ గాంధీ పేర్లను ఛార్జిషీట్‌లో ఈడీ చేర్చడం గమనార్హం.

# పాఠశాల వంటగదిలో విష ప్రయోగం

**30 మంది విద్యార్థులకు తప్పిన ముప్పు**

**నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వెల్లడి**





**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విష ప్రయోగం జరిగింది. విద్యార్థులు తాగే నీటి ట్యాంక్‌లో దుండగులు పురుగుల మందు కలిపారు. మధ్యాహ్న భోజన సామగ్రిపై కూడా పురుగుల మందులు చల్లారు. బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉండటంతో పాఠశాలలోని వంట గదికి సిబ్బంది తాళాలు వేసుకుని వెళ్లారు. సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన సిబ్బంది వంట చేసేందుకు పాత్రలు కడిగే సమయంలో దుర్వాసన, నురగలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పాఠశాల హెడ్ మాస్టర్, సిబ్బంది చుట్టుపక్కల చూడగా పురుగుల మందు డబ్బా కనిపించింది. అలాగే తాగు నీటి ట్యాంక్‌లోనూ పురుగుల మందు కలిపినట్లు-గా సిబ్బంది గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది.. విద్యార్థులను తాగునీటి కుళాయిల వైపు వెళ్లకుండా చూశారు. మధ్యాహ్న భోజనం వండలేదు. ఈ ఘటనపై ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సరైన సమయానికి పాఠశాల సిబ్బంది గుర్తించి మధ్యాహ్న భోజనం వండకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ధర్మపురి పాఠశాలలో దాదాపు 30 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా విష ప్రయోగం నుంచి బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఈ ఘటనపై పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు మండిపడుతున్నారు. అసలు స్కూల్ పిల్లలపై విష ప్రయోగం చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని.. చిన్న పిల్లలు ఏం పాపం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చోడలోని ప్రభుత్వ పాఠశాల వంట గదిలోని నీటిలో పురుగుల మందు కలిపిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కుటుంబ కలహాల కారణంగానే నిందితుడు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఈ నెల 13, 14వ తేదీల్లో సెలవు కావడంతో ఇచ్చోడ మండలం ధర్మపురి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మూసివేశారు. మంగళవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూసేసరికి స్కూల్ వంటగదికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని అక్కడి ఉపాధ్యాయురాలు, సిబ్బంది గమనించారు. వంటగదిలో ఉన్న ఒక బకెట్‌లో నీరు తెలుపు రంగులో ఉండటాన్ని వారు గమనించారు. అక్కడి పాత్రలను చూసి అనుమానం వచ్చిన టీచర్ ప్రతిభ.. వెంటనే గ్రామ సర్పంచి, స్థానిక పెద్దలకు సమాచారం ఇచ్చారు. వారు పాఠశాలకు వచ్చి పరిశీలించగా.. నీటిలో పురుగుల మందు కలిపినట్లు గుర్తించారు. ఉపాధ్యాయురాలు ప్రతిభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఇచ్చోడ సీఐ భీమేశ్ పాఠశాలను పరిశీలించి వివరాలు సేకరించారు. ధర్మపురికి చెందిన వ్యక్తిపై అనుమానంతో ఆ దిశగా దర్యాప్తు చేశారు. ధర్మపురి గ్రామానికి చెందిన సోయం కిస్టును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. తానే పురుగుల మందు కలిపినట్లు- అంగీకరించాడు. నిర్మల్‌లో ఉన్న తన సోదరుడి ఇంటి నుంచి పురుగుల మందు తీసుకొచ్చి.. పాఠశాల వంట గది తాళాన్ని పగలగొట్టి నీటిలో కలిపినట్లు అంగీకరించాడు. కుటుంబ కలహాల కారణంగా గత కొంతకాలంగా నిందితుడు మానసికంగా ఇబ్బందిపడుతున్నట్లు దర్యాప్తులో గుర్తించాం. తన ఇంట్లో వారిపై ఉన్న కోపంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. నిందితుడిని అరెస్టు చేశాం. అని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటన వల్ల పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అపాయం జరగలేదని ఎస్పీ తెలిపారు.

# నేటినుంచి భూభారతి అవగాహన సదస్సులు

**నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు**

**ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రారంభించనున్న పొంగులేటి**



**ప్రజానావ, హైదరాబాద్ :** ధరణి స్థానంలో తీసుకుని వచ్చిన తెలంగాణ భూ భారతి కార్యక్రమం గురువారం నుంచి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న భూభారతి పైలట్ ప్రాజెక్టు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించనున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డిలోని లింగంపేట, నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపురంలో భూ భారతి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మద్దూర్ మండలం ఖాజీపురంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. అలాగే.. వికారాబాద్ జిల్లా పుడూరు గ్రామంలో జరిగే భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ అధికారులు పాల్గొననున్నారు. ఏప్రిల్ 17 నుంచి జూన్ 2 వరకు భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులు నిర్వహించనుంది ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఒక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం ఇది. దీని ప్రయోజనం రాష్ట్రంలో భూ నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించడం , రైతులకు, పర్యావరణానికి అనుకూలంగా భూముల వినియోగాన్ని ప్రోత్సహించడం. ఈ కార్యక్రమం, తెలంగాణలో భూముల రిజిస్ట్రేషన్, భూమి చట్టాలు, ఆస్తి హక్కుల పునరుద్ధరణ వంటి ముఖ్యమైన అంశాలను కవర్ చేస్తుంది. భూ భారతి కార్యక్రమం ద్వారా, ప్రభుత్వమే భూముల ఖాతాలు, రికార్డులను సరికొత్తగా సృష్టించి వాటి మాలికల హక్కులను సులభంగా ప్రజలకు అందించేందుకు సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది రైతులకు భూములపై అనువైన పర్యవేక్షణను, కరెంట్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ అంశాలు వంటి వాటిపై అవగాహన కూడా పెంచుతుంది.

# గ్రూప్-1 పరీక్షలో భారీ స్కామ్

**సిబిఐ విచారణ జరిపించాలి: పాడి డిమాండ్**



**ప్రజానావ, హైదరాబాద్ :** గ్రూప్-1 పరీక్షలో భారీ స్కామ్ జరిగిందని బీఆర్ఎస్ నేత, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మొత్తం 21,093 మంది మెయిన్స్ పరీక్ష రాస్తే.. 21,103 మందికి ఫలితాలు ఎలా ఇచ్చారని అన్నారు. ఆ 10 మంది అదనంగా ఎలా వచ్చారని ప్రశ్నించారు. పరీక్ష రాసిన వాళ్ళకంటే ఎక్కువ మందికి రిజల్ట్ ఇస్తారని నిలదీశారు. ఉర్దూ మీడియంలో మొదటగా 9 మంది అని చెప్పి.. తర్వాత 10 అంటున్నారు.. ఒక్కరు ఎలా పెరిగారని క్వశ్చన్ చేశారు. యూపీఎస్సీలో ప్రిలిమ్స్‌కు, మెయిన్స్ కు ఒకేటే హాల్ టికెట్ ఉంటుందని.. మరీ ఇక్కడ ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఎందుకు వేర్వేరుగా హాల్ టికెట్ నెంబర్లు ఇచ్చారన్నారు. కమిషన్లు తీసుకోని ఫలితాలు ఇచ్చారని ఆరోపించారు. 438 సిరీస్‌లో ఉన్న వారందరికీ ఒకే మార్కులు ఎలా వస్తాయన్నారు. కాంగ్రెస్ నేత రాములు నాయక్ కోడలికి మల్టీ జోన్‌లో ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. తన కోడలు పరీక్షల కోసం 18 గంటలు చదివిందని రాములు నాయక్ చెప్పారు. ఆయన కోడలు మాత్రం రోజు 5 గంటలు చదివానని చెప్పింది. ఇద్దరిలో ఎవరు చెప్పేది నిజమని ప్రశ్నించారు. కోటి ఉమెన్స్ కాలేజ్‌లో అమ్మాయిలు మాత్రమే పరీక్షా రాశారని.. ఈ సెంటర్లో పక్కా స్కామ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని విభాగాల్లో ఫెయిల్ అయ్యిందని.. స్కాములు చేస్తోందని అన్నారు.



# అక్రమ వలసదారులకు ట్రంప్ బంపర్ ఆఫర్

**స్వీయ బహిష్కరణ పథకం అందచేస్తామని ప్రకటన**

**విమాన ఖర్చులతో పాటు, దారి బత్తెం ఇస్తామని వెల్లడి**

**వాషింగ్టన్,ఏప్రిల్ 16 :** అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేందుకు ఇన్నాళ్లూ కఠిన నిబంధనలు అమలు చేస్తూ వచ్చిన అమెరికా ప్రభుత్వం.. తాజాగా వారికి ఓ బంపర్‌ఆఫర్ ఇచ్చింది. ఎవరైతే స్వచ్ఛందంగా అమెరికా వీడి తమ స్వదేశానికి వెళ్లిపోతారో.. వారికి విమాన టికెట్లతో పాటూ కొంత ఆర్థిక సాయం కూడా చేయ-ఽబోతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అమెరికా నుంచి బయటికి పంపించడంపై దృష్టి సారించినట్లు చెప్పారు. అమెరికాలోని వలసదారులపై డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ దేశం విడిచివెళ్లేవారికి విమాన ఛార్జీలు, స్టైఫండ్‌ను అందిస్తున్నట్లు- చెప్పారు. ఈ సందర్భంగా యాంకర్ ట్రంప్‌కు ఓ వీడియో చూపించారు. ఓ వ్యక్తి 20 ఏళ్ల క్రితం చట్టవిరుద్ధంగా అమెరికాకు వచ్చాడని, ప్రస్తుతం అతికి పిల్లలు కూడా ఉన్నారని ఆ వీడియో సారాంశం. తాను ఓటు వేయలేకపోయినా, తాను ట్రంప్‌కు మద్ధతు ఇచ్చేవాడినని ఆ వ్యక్తి తెలిపారు. ఈ వీడియో చూసిన ట్రంప్.. ఇలాంటి వ్యక్తిని తమ దేశంలో ఉంచుకోవాలని అనుకున్నట్లు- చెప్పారు. ఇలాంటి వారి వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని కూడా చెప్పారు. వలసదారులను దేశం నుంచి పంపించడమే తమ ప్రథమ లక్ష్యమని, అయితే వారు ఉండడానికి అర్హులని తేలితే.. తిరిగి వెనక్కి తీసుకురావడానికి కూడా అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. స్వీయ బహిష్కరణకు తుది ఉత్తర్వులు పొంది కూడా 30 రోజులు దాటి అమెరికాలో నివసిస్తున్న వారికి రోజుకు 998 డాలర్లు జరిమానాగా విధిస్తామని అమెరికా ప్రభుత్వం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా స్వీయ బహిష్కరణ వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు. స్వతహాగా దేశాన్ని విడిచిపెట్టి వెళ్లడం వెళ్లాలనేకునే వారికి సాయం అందిస్తామని చెప్పారు. తమ దేశాలకు వెళ్లే క్రమంలో చార్జీలను భరించలేకపోతే.. సబ్సిడీ విమాన సర్వీసుకు కూడా అర్హులవుతారని అధికారులు పేర్కొన్నారు.


# జేడీ వాన్స్ భారత్ పర్యటన ఖరారు

**18 నుంచి 24 వరకు సతీసమేతంగా పర్యటన**

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 16 :** అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటన ఖరారైంది. సతీమణి ఉషా వాన్స్‌తో కలిసి ఇటలీ, భారత్‌లను సందర్శించనున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం ఈమే-రకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఉపాధ్యక్ష పదవి చేపట్టిన అనంతరం జేడీ వాన్స్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి. ఆయన సతీమణి ఉష తెలుగమ్మాయి అనే విషయం తెలిసిందే. ఇటలీ, భారత్ పర్యటనల్లో భాగంగా ఆయా దేశాల నేతలతో వాణిజ్య, భౌగోళిక రాజకీయ అంశాలపై జేడీ వాన్స్ చర్చలు జరుపుతారని అమెరికా ఉపాధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. భారత పర్యటనలో భాగంగా వాన్స్ కుటు-ంబం దిల్లీ, జైపూర్, ఆగ్రాలను సందర్శించనుంది. ఆయా చారిత్రక ప్రదేశాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొననుంది. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీతో జేడీ వాన్స్ భేటీ- కానున్నారు. భారత్- అమెరికా వాణిజ్య చర్చల వేళ ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1970ల్లోనే అమెరికాకు వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. యేల్ లా స్కూల్‌లో ఉషా, జేడీ వాన్స్ తొలిసారి కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడి.. 2014లో హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భర్త విజయంలో ఉష కీలక పాత్ర పోషించారు. అమెరికా సెకండ్ లేడీ హోదాలో తన పూర్వీకుల దేశానికి రావడం ఆమెకు ఇదే తొలిసారి.

# 15మందితో గద్దర్ అవార్డుల జ్యూరీ కమిటీ

**చైర్‌పర్సన్‌గా జయసుధ నియామకం**



**ప్రజానావ, హైదరాబాద్:** తెలుగు సినిమా రంగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీకి చైర్‌పర్సన్‌గా నటి జయసుధను ఎంపిక చేశారు. నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నిర్ణయం కూడా తీసుకుంది. ఈ క్రమంలో 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ఈ నెల 21 నుంచి జ్యూరీ పరిశీలించనుంది. జయసుధ, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్‌లతో సమావేశమైన ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని కోరారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను ఇస్తున్నట్టు గుర్తుచేసిన దిల్ రాజు.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డులకు ఇంతటి స్పందన రాలేదన్నారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల కోసం అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లురాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు వెల్లడించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# తెలంగాణలో రాగల మూడ్రోజులు వర్షాలు

### ఈదురుగాలులతో వానలు పడే అవకాశం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే ఛాన్స్ ఉందని చెప్పింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు పడుతాయని తెలిపింది. కొన్ని జిల్లాల్లో బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, మరికొన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. రానున్న రెండు రోజులు పలు జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతోపాటు– ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సూచనలున్నాయని పేర్కొంది. రాగల మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందంది. నైరుతి బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టం నుంచి 1.5 కి.మీ.ఎత్తులో కొనసాగిన ఉపరితల ఆవర్తనం.. బలహీన పడిందని




వాతావరణ కేంద్రం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం సైతం హైదరాబాద్ మహానగరంలో ఉదయం నుంచి ఎండలు మండిపోయాయి. మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి ఉన్న సంగతి తెలిసిందే. ఇక వాతావరణంలో తేమ శాతం బాగా తగ్గిపోయింది. ఇక నీటి ఎద్దడి సైతం ప్రజలును తీవ్ర ఇబ్బందికి గురి చేస్తోంది. గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

## సంపాదకీయం



# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి!

అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహితంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శత్రువులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్త్‌లను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిరుద్యోగం ఇంతని చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు ధైర్యం దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. బ్ఆయంకుల రుణాలు కూడా తీల్చి పిప్పి చేస్తున్నాయి. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్దికి నమూనా ఎలా అవుతుందన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్ కళ్లముందే వెక్కిరిస్తోంది. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. వారికి కనీస రక్షణా లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో దేశీయంగా ఉపాధి రంగాన్ని పరుగులు పెట్టించాలి. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందించే స్థాయికి వైద్యరంగం బలపడాలి. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా దేశంలో విధానాలు మారాలి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకోవాలి. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచు తామని బిజెపి చేసిన హామీలు అమలు చేసుకోవడానికిదే సరైన తరుణం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాలను సరళీకరించాలి. ఈ క్రమంలో వ్యవసాయ ఎగుమతులు పెంచుకోవాలి. మనవద్ద పండుతున్న మిర్చి, పత్తి, పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటలను ప్రపంచ దేశాలకు విరివిగా ఎగుమతి చేయడం ద్వారా ఆదాయాలను సమకూర్చు కోవాలి. ఇటీవల ఆక్వా ఎగుమతులపై ట్రంప్ ప్రభావం పడింది. దానిపై దృష్టి సారించాలి. చైనా లాగా మానవవనరులను ఉపయోగించి వస్తూత్పత్తిని పెంచుకోవాలి. ప్రపంచ దేశాలపై ఆధారపడే విధానం పోవాలి. అప్పుడే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. నిరుద్యోగం సమిసి పోగలదు. చైనా తరహాలో కఠినంగా సాగితేనే ఇది సాధ్యమని గుర్తించాలి.

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత

### స్టేజీపైనే పరస్పరం విమర్శలు చేసుకున్న మంత్రి, వేముల

**ప్రజానావ, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా భీంగల్ లో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణిలో ఉద్రిక్తత నెలకొంది. స్టేజ్ పైనే మంత్రి జూపల్లి కృష్ణారావు,బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఒకరినొకరు వాగ్వాదానికి దిగారు. జూపల్లి మాట్లాడుతుండగా డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్,బీఆర్ఎస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. మంత్రి జూపల్లి స్టేజ్ పై కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ చేస్తుండగా తులం బంగారం ఏమైందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. వెంటనే మంత్రి జూపల్లి కల్గజేసుకుని 10 ఏళ్లలో మీరు మూడెకరాల భూమి ఇచ్చారా?. నిరుద్యోగ భృతి ఇచ్చారా? గతంలో చేసిన ముఖ్యమంత్రుల అప్పు,10 ఎళ్లలో కేసీఆర్ చేసిన అప్పు సమానం. మేము వచ్చి 16 నెలలే అయింది ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తాం అని మంత్రి జూపల్లి బదులిచ్చారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం తలెత్తడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు బాహాబాహికి దిగారు. పోలీసులు కల్గజేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. తోపులాట జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేయడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.



## సొరంగంలో కొనసాగుతున్న సహాయకచర్యలు

### 55 రోజులు దాటినా జాడలేని మృతుల ఆనవాళ్లు

### రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక కమిటీ ఏర్పాటు

**ప్రజానావ, హైదరాబాద్:** ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న వారి కోసం 55 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. చివరి 50 మీటర్ల ప్రాంతం వరకు 800 టన్నుల ఇనుము, 1200 క్యూబిక్ మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను తొలగించారు. మిగిలిన ప్రాంతం చాలా ప్రమాదకరంగా ఉందని, మిగిలిన వ్యర్థాలను తొలగిస్తే ప్రతికూల పరిణామాలు ఎదు–ర్కోవాల్సి రావొచ్చని జీఎస్ఐ హెచ్చరించింది. సహాయక చర్యలు కొనసాగిస్తే సహాయక చర్యల్లో పాల్గొనే వారికి ప్రమాదం ఎదురుకావచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. వీటన్నింటి నేపథ్యంలో అవసరమైన అనుమతులు తీసుకొని సహాయక చర్యలు చేపట్టాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఈ క్రమంలో ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో తీసుకున్న నిర్ణయం మేరకు కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్, ఎన్జీఆర్ఐ డైరెక్టర్, జీఎస్ఐ డిప్యూటీ– డైరెక్టర్ జనరల్, ఎన్సీఎస్ డైరెక్టర్, బీఆర్‌వో కల్నల్ పరీక్షిత్ మెహ్రా, తెలంగాణ పీసీసీఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ అదనపు డీజీ, సీడీవో సీఈ, నాగర్‌కర్నూల్ కలెక్టర్, ఎస్పీ, ఎస్ఎల్‌బీసీ చీఫ్ ఇంజినీర్, నిపుణులు సాంకేతిక కమిటీలో సభ్యులుగా ఉండనున్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలోని చివరి 30 నుంచి 50 మీటర్ల క్రిటికల్ జోన్‌లో ఉన్న రాతి పొరల స్థితి కారణంగా ఆ ప్రాంతంలో ఎలాంటి సహాయక చర్యలు చేపట్టవద్దని జీఎస్ఐ సూచించింది. ఈ నేపథ్యంలో ఆ క్రిటికల్ జోన్‌లో అనుసరించాల్సిన కార్యాచరణ, వ్యూహాల రూపకల్పనకు ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. నిర్దిష్ట గడువులోగా ఆరుగురు కార్మికుల మృతదేహాలను వెలికితీసి కుటు–బసభ్యులకు అప్పగించేలా కమిటీ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సహాయక చర్యల్లో అపాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపైనా కమిటీ– సూచనలు చేయాల్సి ఉంటుంది.

# ఎపి కృష్ణాజలాల దోపిడీ

### చేష్టలుడిగిన రాష్ట్ర ప్రభుత్వం

### మండిపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి



**ప్రజానావ, సూర్యాపేట:** తెలంగాణ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కృష్ణా నదీ జలాల వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనాన్ని తీవ్రంగా విమర్శించారు. గత రెండు నెలలుగా తమ పార్టీ చెబుతోన్న వాదనల్ని ఇప్పుడు కృష్ణా బోర్డు కూడా సమర్థించిందని తెలిపారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటి వరకు అక్రమంగా 65 టీ–ఎంసీల నీటిని తీసుకెళ్లిందని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం నీళ్లను అక్రమంగా తరలిస్తుందన్న విషయం మేము ఎప్పటి నుంచో చెబుతున్నాం. కానీ, ఇప్పుడే కృష్ణా బోర్డు చెప్పడంతో మా మాటకు న్యాయం జరిగినట్లయ్యిందని అన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ఏదో చంద్రబాబుతో లోపాయికీ ఒప్పందం చేసుకున్నట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి పైరవీలు నమోదు చేయకుండా మౌనంగా ఉండటం వెనుక కారణం ఇదే కావచ్చని మండిపడ్డారు. ఈ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముందని హెచ్చరించారు. తాగునీటికి కూడా ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఈ అంశంపై ఒక్క రివ్యూకూడా చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజలు మళ్లీ పాత రోజులకు, దరిద్రాలకు వస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని.. ఆయన ప్రజలను ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ అంశంపై త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ కార్యచరణ ప్రకటిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

## బెంగాల్ అల్లర్లలో ముగ్గురు మృతి

### పదిలక్షల చొప్పన సిఎం ఎక్స్‌గ్రేషియా ప్రకటన

**కోల్‌కతా,ఏప్రిల్ 16 :** వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అల్లర్లతో గత కొద్ది రోజులుగా బెంగాల్ అట్టుడుకుతోంది. వక్ఫ్ చట్టాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున ముస్లింలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. పలు చోట్ల హింస చెలరేగడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయాలయ్యాయి. ఇక పోలీస్ బలగాలు రంగంలోకి దిగి లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు. అయినా కూడా అక్కడక్కడ అల్లర్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక నిరసనకారులు వాహనాలను తగలబెట్టారు. ఇదిలా ఉంటే ముర్షిదాబాద్ హింసలో మరణించిన ముగ్గురు వ్యక్తుల కుటుంబానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సాయం ప్రకటించారు. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను మమత ప్రకటించారు. ఇక అల్లర్లు కారణంగా వందలాది హిందూ కుటుంబాలు ఇళ్లను వదిలి వేరే చోట ఆశ్రయం పొందుతున్నారు. ఇక హింసకు పాల్పడిన 150 మందికి పైగా ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదిలా ఉంటే వక్ఫ్ చట్టాన్ని బెంగాల్‌లో అమలు చేయబోమని ఇప్పటికే సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. కానీ అల్లర్లు ఆగలేదు. తాజాగా బుధవారం నేతాజీ ఇండోర్ స్టేడియంలో ముస్లిం మతాధికారులు, ఇమామ్‌లు, ముజ్జిన్‌లు, ముస్లిం మేధావులతో మమతా బెనర్జీ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల బాధ్యతను కోల్‌కతా మేయర్, ముస్లిం సమాజానికి చెందిన సీనియర్ టీఎంసీ నేత ఫిర్హాద్ హకీమ్‌కు అప్పగించారు. శాంతిని నెలకొల్పేందుకు ముస్లిం పెద్దలతో మమత చర్చించనున్నారు.

# హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ ట్రైన్ యాత్ర

## జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్



**ప్రజానావ, సిరిసిల్ల:** హైదరాబాద్ నుంచి భారత్ గౌరవ ట్రైన్ యాత్ర సమ్మర్ స్పెషల్ ప్యాకేజ్ అందుబాటులో ఉన్నాయని జనరల్ మేనేజర్ టూరిజం డీఎస్‌జీపీ కిషోర్ బుధవారం పేర్కొన్నారు. భారత రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ ద్వారా భారత గౌరవ టూర్ పేరుతో ప్రత్యేకంగా దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాలను హైదరాబాద్ నుంచి పర్యటనకు ప్యాకేజీలు తయారు చేసిందని, వీటిలో ట్రైన్ జర్నీ బస్ జర్నీ హెూటల్ భోజన ఖర్చులు, గైడ్ తో సహా సైట్ సీయింగ్ ఉంటాయని అన్నారు. భారత గౌరవ టూర్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి ఐదు ప్యాకేజీ లలో ప్రత్యేక ట్రైన్లు ఉన్నాయని తెలిపారు.

### నాలుగు ప్యాకేజీల్లో సమ్మర్ స్పెషల్ టూర్..

మొదటి ప్యాకేజ్ కింద ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు 9 రాత్రులు, 10రోజులలో హరిద్వార్, రిషికేష్ వైష్ణవ దేవి, ఆనంద్ పూర్, నైనా దేవి, అమృత్ సర్ పర్యాటక ప్రాంతాలను చేయడం జరుగుతుందని, ప్రతి మనిషికి రూ. 18,150 ఖర్చు అవుతుందన్నారు. రెండో ప్యాకేజ్ కింద మే 8 నుంచి మే 17 వరకు 9 రాత్రులు, 10 రోజుల్లో వారణాసి, పూరి, గయా, అయోధ్య, ప్రయాగ్ రాజ్, కోణార్క్ పర్యాటక ప్రాంతాలను చేయడం జరుగుతుందని, ప్రతి మనిషికి రూ. 16,800 ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. మూడో ప్యాకేజ్ కింద మే 22 నుంచి మే 30 వరకు 8 రాత్రులు , 9 రోజుల్లో అరుణాచలం, రామేశ్వరం, తంజావూర్, కన్యాకుమారి, త్రివేండ్రం , తిరుచ్చి, మధురై పర్యాటక ప్రాంతాలను చేయడం జరుగుతుందని, ప్రతి మనిషికి రూ. 14,700 ఖర్చు అవుతుందన్నారు. నాలుగో ప్యాకేజ్ కింద జూన్ 4 నుంచి జూన్ 12 వరకు 8 రాత్రులు , 9 రోజుల్లో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, ఘృశ్నేశ్వర్, ఎల్లోరా, మోహం, నాగ్ పూర్ పర్యాటక ప్రాంతాలను చేయడం జరుగుతుందని, ప్రతి మనిషి రూ. 14, 700 ఖర్చు అవుతుందన్నారు. భారత రైల్వే సంస్థ నిర్వహిస్తున్న భారత గౌరవ టూర్‌లో పాల్గొనాలనుకుంటే www.irctctourism.com వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్‌లో లేదా సికింద్రాబాద్ రోడ్డులోని ఐఆర్‌సీటీసీ, మూడో ఫ్లోర్, ఆక్స్‌ఫర్డ్ ప్లాజా, సికింద్రాబాద్ నందు బుక్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 04027702407, 9701360701, 9281495845, 9281495843, 9281030750, 9281030740 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

# లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్లపై కఠినచర్యలు తీసుకోవాలి

- జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు నిరంతరం పర్యవేక్షించాలి
- ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యధిక ప్రసవాలు జరిగేలా కార్యాచరణ
- సిరిసిల్ల వైద్యారోగ్య శాఖపై రివ్యూలో ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్



**ప్రజానావ, సిరిసిల్ల:** సిరిసిల్ల జిల్లా పరిధిలో లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు తీసుకోవాలనీ ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జిల్లా కలెక్టర్, వైద్యారోగ్యశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల వైద్య ఆరోగ్య శాఖ పని తీరు పై వైద్య అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు నిరంతరం పర్యవేక్షించాలని, ఆడపిల్లలు భ్రూణ హత్యలు జర్గకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పి.సి.ఎన్.బి యాక్ట్ సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా అడ్వైజర్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యధికంగా ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, అత్యవసరమైన పక్షంలోనే సి సెక్షన్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు.

### కట్టుదిట్టంగా పీసీఎన్‌బీ యాక్ట్

జిల్లాలో నూతన ఆసుపత్రుల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మాత్రమే జరగాలని అన్నారు. పీసీఎన్‌బీ యాక్ట్ అమలు జిల్లాలో కట్టుదిట్టంగా నిర్వహించాలని, నూతన స్కానింగ్ సెంటర్లు, పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు కమిషనర్ అనుమతి తప్పనిసరని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది, మందుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరాలకు అనుగుణంగా స్పెషలిస్ట్ డాక్టర్లను ఎప్పటికప్పుడు నియమించుకోవాలన్నారు. ప్రతి వ్యాధికి సంబంధించి అవసరమైన మందులు పూర్తిస్థాయిలో ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

### బయట మందులు కొనొద్దు..

ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అందుబాటులో ఉన్న డ్రగ్స్ వివరాలపై వైద్య సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలని, అందుబాటులో ఉన్న డ్రగ్స్ ను మాత్రమే రోగులకు ప్రిస్క్రైబ్ చేయాలని, రోగులు అనవసరంగా బయట ప్రైవేటుగా మందులు కొనాల్సిన అవసరం రావద్దని సంచాలకులు తెలిపారు. డ్రగ్స్ స్టాక్ వివరాలు కట్టుదిట్టంగా నిర్వహించాలని సంచాలకులు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్స్ సేవల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి శాంపిల్స్ సేకరించి డయాగ్నస్టిక్ సెంటర్ ద్వారా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. రేడియాలజీ విభాగానికి సంబంధించి కూడా పరీక్షల నివేదికలు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. ప్రతి ల్యాబ్ టెక్నీషియన్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలు సమర్ధవంతంగా అందించేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.రజిత, డా. లక్ష్మీనారాయణ, డా. పెంచలయ్య, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే లైన్ భూ సేకరణ పెండింగ్ పరిహారం త్వరగా చెల్లించాలి

## కేబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్



**ప్రజానావ, సిరిసిల్ల:** కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ భూసేకరణ పెండింగ్ పరిహారం త్వరగా చెల్లించాలని కేబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ అన్నారు. బుధవారం క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వే లైన్ భూ సేకరణ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్ అభివృద్ధి పనులలో పెండింగ్ భూ సేకరణ పరిహారం చెల్లింపుల స్థితి గతుల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కేబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ మాట్లాడుతూ మనోహరాబాద్ నుంచి కొత్తపల్లి వరకు 151 కిలో మీటర్ల రైల్వే లైన్ అభివృద్ధి పనులు భాగంగా భూ సేకరణ పెండింగ్ పరిహార చెల్లింపు సంబంధిత లబ్ధిదారులకు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు.

### పారిశ్రామిక అభివృద్ధి

సిద్దిపేట, మెదక్ ,కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలను సికింద్రాబాద్ రైల్వే లైన్ కలపడం వల్ల పారిశ్రామికంగా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు 32 కిలోమీటర్లు, గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు 40 కిలోమీటర్లు, సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు 40.80 కిలోమీటర్లు, సిరిసిల్ల నుంచి కొత్తపల్లి వరకు 39 కిలోమీటర్ల 4 దశలలో పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం రెండో దశ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ పనులు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి భూసేకరణ పూర్తి చేసి రైల్వే కు అప్పగించాలని అన్నారు. పెండింగ్ భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్ సిరిసిల్ల జిల్లాలో 40 కిలోమీటర్ల మేర ఉందని, దీనికి సంబంధించి 386.21 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉండగా 342.46 హెక్టర్ల భూమి సేకరించి రైల్వే శాఖకు బదిలీ చేశామన్నారు. పెండింగ్ ఉన్న 43.42 హెక్టార్ల భూ సేకరణలో భాగంగా రిజర్వ్ ఫారెస్ట్ 15.21 హెక్టార్లను రైల్వే శాఖకు అప్పగించమని దాని బదులు అటవీ శాఖకు కొనరావుపేట మండలంలోని కొండాపూర్ గ్రామంలో 38 ఎకరాల ఐదు గుంటల భూమి అందించమని అన్నారు. పెండింగ్ భూసేకరణ చేసేందుకు రూ.68 కోట్ల 80 లక్షలు పీడీ అకౌంట్‌లో జమ అయ్యాయని, భూ నిర్వాసితులకు పరిహార చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం వేసి చూస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు మద్దతు అందించేందుకు
# కొనుగోలు కేంద్రాలు

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

### బొప్పాపూర్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**ప్రజానావ, ఎల్లారెడ్డిపేట:** రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పపూర్ లోని ఏఎంసీలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు బుధవారం ఏర్పాటు చేయగా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్నీ సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. సరైన తేమ శాతంతో ధాన్యాన్ని నిర్వాహకులు సేకరిస్తారని వివరించారు. కొనుగోలు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని, డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం అమ్ముకోవడానికి వచ్చే రైతులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో మొత్తం 191 కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రైతులకు ఐకేపీ వారు ఉత్తమ సేవలు అందిస్తున్నారని వివరించారు. మిల్లర్లు ధాన్యం సేకరించకపోతే సమీపంలోని ప్రభుత్వ గోదాముల్లో నిల్వ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి అఫ్జలి బేగం, డీఆర్డీఓ శేషాద్రి, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఆలయ అభివృద్ధిపై సమావేశం

**ప్రజానావ, వేములవాడ:** శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి నేపథ్యంలో ప్రభుత్వ విప్. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం ఉదయం 9.30 గం.కు దేవస్థానం చైర్మన్ గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఈ. శ్రీధర్, వీటీడీఏ వైస్ చైర్మన్, సీఈఓ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఆర్కిటెక్స్, స్థపతులతో పాటు సంబంధింత ఇంజినీరింగ్ విభాగం అధికారుగులు పాల్గొంటారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. సమావేశం అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన జరపనున్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొలనూరు, నిమ్మపల్లి, గ్రామాల్లోని ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్షం, చిన్నారులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలో అందించే విలువైన పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కనకమ్మ, గంగా లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు సునీత, జ్యోతి, అఖిల, కొలనూరు అంగన్వాడీ క్లస్టర్ పరిధిలోని టీచర్లు, ఆయాలు, సీసీలు, సీఏ, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# నిమ్మపల్లిలో ఘనంగా బీరప్ప ఉత్సవాలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ ఆలయాన్ని సందర్శించి బీరప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు ప్రభుత్వ విప్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నాగండ్ల భూమేశ్, మాజీ జెడ్పీటీసీ నాగం కుమార్, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, వైస్ చైర్మన్ ప్రభాకర్, డైరెక్టర్లు వాల్య నాయక్, బాశెట్టి నాగరాజు, ఆజిమ్ పాషా, పెంతల శ్రీనివాస్, ధర్ర రవి, కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# మార్పు, అభివృద్ధిని సూచించేవారే జర్నలిస్టులు

- మీడియా మంచికి మద్దతిస్తూ చెడును పక్కనబెట్టాలి
- తప్పుడు వార్తలతో సమాజం పెడదారి పట్టే అవకాశం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ఏఐతో దెబ్బతింటున్న వాస్తవికత
- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



**ప్రజానావ, వేములవాడ:** సమాజంలో మార్పు, అభివృద్ధిని సూచించేవారే జర్నలిస్టులని, ఒక్కో జర్నలిస్టు వెయ్యి మందితో సమానమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడలో ఐజేయూ ప్రెస్ క్లబ్ సమావేశ మందిరం ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్‌తో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ పాత్రికేయం కరోనా కంటే ముందు ఒకలా, కరోనా తర్వాత మరోలా అనేలా మారిందన్నారు. ఇటీవలి కాలంలో బంధాలు, బంధుత్వాలు అన్ని పోయి వాట్సాప్‌లో హాయ్, బాయ్ అనే పరిస్థితి వచ్చిందనే అభిప్రాయపడ్డారు. 1987 నుంచి తనకు ప్రెస్ వాళ్లతో అనుబంధం ఉందని, మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వ్యవస్థలో చెడు ఉందని, ఇవి చాలవన్నట్టు వీటి మధ్యలోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చిందన్నారు. చివరికి దేశ ప్రధాని మోడీ సైతం అబద్ధాలు మాట్లాడే స్థాయికి ఏఐ తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఎవరిని విలేకరిగా చూడాలి?

మీడియా నైతిక విలువలు కాపాడే క్రమంలో ఇప్పుడు ఎవరిని విలేకరిగా చూడాలనే ప్రస్తావన జరుగుతుందని, రోతలు పుట్టించే రాతలు, ఆడబిడ్డలు కన్నీటిని పెట్టించే స్థితి వచ్చిందన్నారు. మీడియా రాతల విషయంలో గతంలో వలే మళ్లీ క్లాసులు పెట్టుకొని వినాల్సిన అవసరం ఉందన్నారు. తప్పుడు వార్తలతో సమాజం పెడదారి పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. మంచికి మద్దతు ఇస్తూ, చెడును పక్కన పెట్టాలని.. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మీడియా ప్రజల పక్షాన నిలబడాలని ఆయన కోరారు. తన గెలుపులో మీడియా మిత్రుల పాత్ర ఎంతో ఉందని, తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి నేటివరకు మీడియా సహకారం మరువలేనిదని, తాను ఎమ్మెల్యేగా పనిచేస్తున్న తరుణంలో చేపడుతున్న కార్యక్రమాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గతంలో వలే మీలో ఒకడిగా ఉంటూ మీ సలహాలను, సూచనలను పాటిస్తూ వేములవాడ నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో రాజన్న ఆలయ అభివృద్ధితో పాటు వేములవాడ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నానని, గతంలో 'వేములవాడ ఎందుకో వెనకబడింది' అనే నినాదం ఇచ్చిన తాను ఎమ్మెల్యే అయిన వెంటనే గత పదేళ్లలో పడవు పడిన ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గాన్ని, రాజన్న ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ఎలాంటి సహకారం అందిస్తానని, జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

### సాంకేతికతకు అనుగుణంగా వార్తలు..

ప్రస్తుతం సోషల్ మీడియా, ఏఐ వ్యవస్థతో వాస్తవికత దెబ్బతింటుందని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జర్నలిజంలో మారుతున్న పరిస్థితులు, సాంకేతికతకు అనుగుణంగా వాస్తవాలను తెలుసుకుని వార్తలు అందించాలని సూచించారు. జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండి వాస్తవాలను తెలుసుకొని ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ ఆలీ, నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.



# ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

### రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే



**ప్రజానావ, ఇల్లంతకుంట:** పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించి బాధితులకు నమ్మకం, భరోసా కలిగించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే అన్నారు. బుధవారం ఆయన ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులను, పోలీస్ స్టేషన్ పరిధి గ్రామాలతో పాటు గతంలో జరిగిన సంఘటనల వివరాలు, కేసులు, సిబ్బంది విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో ఎంతమంది రౌడి షీటర్లు ఉన్నారని, వారిని ఎలా తనిఖీ చేస్తారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వారి సమస్యను తెలుసుకొని వారికి భరోసా, నమ్మకం కల్పించాలని, చట్టపరిధిలో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పెట్రోలింగ్ సమయంలో తప్పనిసరిగా రౌడీ, హిస్టరీ షీటర్లతో పాటు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేస్తూ వారి ప్రస్తుత స్థితిగతులపై అరా తీయాలన్నారు. మత్తు పదార్థాలపై, సైబర్ నేరాలపై ముమ్మరంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, సేవించడం వంటి వాటితో పాటు అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచుతూ కట్టడి చేయాలన్నారు. అధికారులు, సిబ్బందికి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ ఆవరణలో వివిధ రకల పండ్ల మొక్కలతో ఏర్పాటు చేసిన తోటకు వాటర్ డ్రిపింగ్(బిందు సేద్యం) ప్రారంభించి ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే సంకల్పం

### ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజానావ, కోనరావుపేట:** మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ సంకల్పమని, పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలో అర్హులైన 23మంది లబ్ధిదారులకు రూ. 23 లక్షల కల్యాణ లక్ష్మి చెక్కులు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి కింద ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం కొనుగులు కేంద్రాలను వారికి కేటాయించారని వెల్లడించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు, మేలైన వంగడాలను ప్రభుత్వం తరఫున అందిస్తున్నామని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రైతు ప్రయోజనాలు కోసం రూ. 21వేల కోట్ల మేర రుణమాఫీ చేయడం జరిగిందని కొనుగోలు చేసిన ధాన్యం పంపిణీ చేయడం కోసం అదనంగా నూతన లారీ ఏజెన్సీలకు ఇవ్వడం జరిగిందన్నారు.

### సన్న బియ్యంపై బీజేపీ రాజకీయం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీపై బీజేపీ రాజకీయం చేస్తుందని ప్రభుత్వ విప్ మండిపడ్డారు. కొందరు ఫ్లెక్సీలు కట్టి మేం పంపిణీ చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని, బీజేపీ పంపిణీ చేస్తే మీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యాన్ని ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగంగానే మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 సిలిండర్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని. బీజేపీ ప్రభుత్వం ఇలాంటి పథకాలను తమ రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ ప్రభాకర్, డైరెక్టర్లు అజీమ్ పాషా, బాశెట్టి నాగరాజు, వాల్య నాయక్, వెంగలి వెంకన్న, ఏపీఎం రాకేశ్, నాయకులు పెంతల శ్రీనివాస్, సదానందం, దర్ర రవి, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

# 17నుంచి 'భూ భారతి'పై అవగాహన సదస్సులు

- 29 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో కార్యక్రమాలు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతిపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సుల షెడ్యూల్ విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి 29వ తేదీ దాకా జిల్లాలోని మండల స్థాయిలో భూ భారతి చట్టం పై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, ఈ అవగాహన కార్యక్రమాల కు రెవెన్యూ డివిజన్ అధికారులు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), కలెక్టర్ హాజరై ప్రజలకు చట్టంలోని అంశాలను వివరిస్తారని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా 17న ఉదయం 10 గంటలకు బోయినపల్లి మండలం, 19న ఇల్లంతకుంట, 21న మధ్యాహ్నం 2 గం.కు కోనరావుపేట, 22నహో ఉదయం 10 గం.కు చందుర్తి, మధ్యాహ్నం 2 గంటలకు రుద్రంగి, 23నహోఉదయం 10 గం.కు వేములవాడ రూరల్, మధ్యాహ్నం 2 గం.కు వేములవాడ, 24నహోదయం 10 గం.కు గంభీరావుపేట, 25న ఉదయం 10 గం.కు ముస్తాబాద్, 26నహోదయం 10 గం.కు తంగళ్లపల్లి, 28న మధ్యాహ్నం 2 గం.కు సిరిసిల్ల, 29న ఉదయం 10 గం.కు ఎల్లారెడ్డిపేట, మధ్యాహ్నం 2 గం.కు వీర్నపల్లి మండలాల్లో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు, భూ యజమానులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భూ భారతి అవగాహన సదస్సుల జిల్లా నోడల్ ఆఫీసర్‌గా సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయ్‌ని నియమించినట్లు తెలిపారు.



ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ ఆలీ బుధవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు చెల్లించుకున్నారు.
- ప్రజానావ, వేములవాడ

# గంజాయి విక్రేత, సేవించిన ఇద్దరి అరెస్ట్

**ప్రజానావ, నేరడిగొండ :** మండలకేంద్రంలోని కుంటాల ఎక్స్ రోడ్డు వద్ద వ్యక్తి గంజాయి సేవిస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికెళ్లి గంజాయి తోపాటు యువకున్ని పట్టుకన్నారు. ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సై ఎల్ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బత్తుల కిరణ్ అనే 20 ఏండ్ల యువకుడు గంజాయి సేవిస్తున్నాడన్న సమాచారం అందింది. అయితే అక్కడికెళ్ళి కిరణ్ ను సోదా చేయగా, అతని వద్ద నుండి 180 గ్రాముల గంజాయి లభ్యం అయ్యింది. యువకున్ని విచారించగా, మండలంలోని ధంస నాయక్ తాండకు చెందిన పెందుర్ లచ్చు అనే వ్యక్తి కొనుగోలు చేసానని తెలిపాడు. వెంటనే లచ్చును అదుపులో తీసుకొని, సోదా చేయగా, తను పంట సాగులో అంతర్గత పంటగా గంజాయి సాగు చేశానని ఒప్పుకున్నాడు. అతని వద్ద నుండి 290 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.



# లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో బుధవారం పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ ఆధ్వర్యంలో 50 పోలీసులతో లాడ్జీల్లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ లాడ్జీల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీలకు వచ్చే యాత్రికుల వద్ద సరైన గుర్తింపు కార్డులు తీసుకోవాలని, వారికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయాలని సూచించారు.

# సీఎంఆర్ఎఫ్‌చెక్కు అందజేత



**ప్రజానావ, తాండూర్:** తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎలుక చిలుకయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకోగా, వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశానుసారం కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో చిలుకయ్యకు రూ. 60 వేల చెక్కు మంజూరు కావడంతో కాంగ్రెస్ గ్రామ నాయకులు బాధితుడికి చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చీర్ల రాజేశం, కాంగ్రెస్ యూత్ మాజీ అధ్యక్షులు డేగ స్వామి, జంబుల ప్రవీణ్, సిద్ధం అశోక్, చీకటి వేంకటేశం,అమిరిశెట్టి మల్లేష్, ఆకుల రజినీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..


# ఢిల్లీ 'సూపర్'

## రాణించిన రాహుల్, అభిషేక్, అక్షర్
## రాజస్థాన్‌పై ఉత్కంఠ విజయం




**న్యూఢిల్లీ:** ఆద్యంతం హెూరాహెూరీగా సాగిన పోరు.. ఈ సీజన్‌లో జరిగిన తొలి సూపర్ ఓవర్‌లో పైచేయి సాధించిన ఢిల్లీ క్యాపిటల్స్ మళ్లీ గెలుపు బాటపట్టింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించిన ఢిల్లీ మళ్లీ టాప్‌కు చేరుకొంది. 188 పరుగుల వద్ద ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో.. మ్యాచ్ ఫలితం సూపర్ ఓవర్‌కు దారితీసింది. సూపర్ ఓవర్‌లో మొదట రాజస్థాన్ 11/2 స్కోరు చేయగా.. ఢిల్లీ 4 బంతుల్లోనే 13 పరుగులు చేసి గెలిచింది. స్టబ్స్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. అంతకుముందు తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 188 పరుగులు చేసింది. అభిషేక్ పోరెల్ (49), కేఎల్ రాహుల్ (38), అక్షర్ పటేల్ (14 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులతో 34), స్టబ్స్ (34 నాటౌట్) రాణించారు. ఆర్చర్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రాజస్థాన్ ఓవర్లన్నీ ఆడి 188/4తో స్కోరు సమం చేసింది. నితీశ్ రాణా (51), యశస్వి జైస్వాల్ (51) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. మ్యాచ్‌లో చివరి ఓవర్‌తో పాటు సూపర్ ఓవర్‌లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన స్టార్క్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

**అదరగొట్టిన ఓపెనర్లు:**

ఛేదనలో ఓపెనర్లు జైస్వాల్, శాంసన్ (31) రాజస్థాన్‌కు అదిరే ఆరంభాన్నిచ్చారు. పవర్‌ప్లేలో ఇద్దరూ పోటీపడి మరీ షాట్లు ఆడుతూ.. 34 బంతుల్లో 61 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, గాయపడిన శాంసన్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో ఆరు ఓవర్లకు రాజస్థాన్ 63/0తో నిలిచింది. మధ్య ఓవర్లలో ఢిల్లీ స్పిన్నర్లు పొదుపుగా బౌలింగ్ చేస్తూ పరుగులను కట్టడి చేశారు. ఈ క్రమంలో రియాన్ పరాగ్ (8)ను అక్షర్ బౌల్డ్ చేసి తొలి బ్రేక్ ఇచ్చాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రాణాతో కలసి జైస్వాల్ స్కోరు బోర్డును నడిపించాడు. 12వ ఓవర్‌లో సింగిల్‌తో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. జట్టు స్కోరు సెంచరీ మార్క్ దాటింది. అయితే, కుల్దీప్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించిన జైస్వాల్ క్యాచవుట్ అయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతుండడంతో రాణా ఎదురుదాడికి దిగాడు. అక్షర్ బౌలింగ్‌లో 6,4,4తో 16 పరుగులు రాబట్టిన రాణా.. కుల్దీప్ వేసిన 16వ ఓవర్‌లో 6,4 బాదాడు. దీంతో లక్ష్యం చివరి 5 ఓవర్లలో 45 రన్స్‌కు దిగివచ్చింది. అయితే, హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న రాణాను స్టార్క్ ఎల్బీగా వెనక్కుపంపడంతో ఢిల్లీ మ్యాచ్‌లోకొచ్చింది. కానీ, జురెల్ (26), హెట్‌మయర్ (15 నాటౌట్) జాగ్రత్తగా ఆడుతూ గెలుపు బాటలో నిలిపారు. కాగా, చివరి ఓవర్‌లో 9 పరుగులు కావాల్సి ఉండగా.. స్టార్క్ 8 పరుగులే ఇవ్వడంతో స్కోరు సమమైంది. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా.. సింగిల్ తీసిన జురెల్ రనౌటయ్యాడు.


**అక్షర్ దూకుడు:**

రాజస్థాన్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్ తడబడుతూనే సాగింది. మందకొడి పిచ్‌పై 14 ఓవర్లకు ఢిల్లీ 106/4 స్కోరు మాత్రమే చేసింది. ఈ క్రమంలో 150 కూడా చేరుకోవడం కష్టమేననిపించింది. కానీ, చివరి ఓవర్లలో స్టబ్స్‌తో కలసి కెప్టెన్ అక్షర్ పటేల్ 19 బంతుల్లోనే 41 రన్స్ జోడించడంతో స్కోరు బోర్డు రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్లింది. ఆ తర్వాత అశుతోష్ శర్మ (15 నాటౌట్) జతగా స్టబ్స్ వేగంగా 42 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో ఢిల్లీ ఊహించని రీతిలో 180 పరుగుల మార్క్ దాటింది. వీరిద్దరి దెబ్బకు రాజస్థాన్ చివరి 5 ఓవర్లలో 77 రన్స్ సమర్పించుకొంది. అంతకుముందు పోరెల్, రాహుల్ మూడో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. అయితే, రాహుల్‌ను ఆర్చర్.. పోరెల్‌ను హసరంగ బోల్తా కొట్టించారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన అక్షర్ ఎడాపెడా షాట్లతో స్కోరు బోర్డులో ఊపుతెచ్చాడు. హసరంగ బౌలింగ్‌లో అక్షర్ 4,4,6తో 19 పరుగులు పిండుకొన్నాడు. తీక్షణ బౌలింగ్‌లో 4,4,6 బాదిన అక్షర్ మరో భారీ షాట్ ఆడే క్రమంలో అవుటయ్యాడు. మెక్‌గుర్క్ (9), కరుణ్ నాయర్ (0) విఫలమయ్యారు.

**స్కోరుబోర్డు**

ఢిల్లీ: మెక్‌గుర్క్ (సి) జైస్వాల్ (బి) ఆర్చర్ 9, అభిషేక్ పోరెల్ (సి) పరాగ్ (బి) హసరంగ 49, కరుణ్ నాయర్ (రనౌట్) 0, రాహుల్ (సి) హెట్‌మయెర్ (బి) ఆర్చర్ 38, స్టబ్స్ (నాటౌట్) 34, అక్షర్ (సి) జురెల్ (బి) తీక్షణ 34, అశుతోష్ (నాటౌట్) 15, ఎక్స్‌ట్రాలు: 9బీ మొత్తం: 20 ఓవర్లలో 188/5బీ వికెట్ల పతనం: 1–34, 2–34, 3–97, 4–105, 5–146బీ బౌలింగ్: ఆర్చర్ 4–0–32–2, తుషార్ 3–0–38–0, సందీప్ 4–0–33–0, తీక్షణ 4–0–40–1, హసరంగ 4–0–38–1, పరాగ్ 1–0–6–0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 51, శాంసన్ (రిటైర్డ్ హర్ట్) 31, పరాగ్ (బి) అక్షర్ 8, నితీశ్ రాణా (ఎల్బీ) స్టార్క్ 51, జురెల్ (రనౌట్) 26, హెట్‌మయెర్ (నాటౌట్) 15, ఎక్స్‌ట్రాలు: 6బీ మొత్తం: 20 ఓవర్లలో 188/4బీ వికెట్ల పతనం: 0–61 (రిటైర్డ్ హర్ట్), 1–76, 2–112, 3–161, 4–188బీ బౌలింగ్: స్టార్క్ 4–0–36–1, ముకేశ్ 3–0–31–0, మోహిత్ 4–0–38–0, విప్రాజ్ 1–0–13–0, అక్షర్ 3–0–23–1, కుల్దీప్ 4–0–33–1, స్టబ్స్ 1–0–12–0.



## చాహల్ ను పొగడ్తలతో ముంచెత్తిన
## రేడియో జాకీ మహ్‌వశ్!

**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్– రూమర్ గర్ల్‌ఫ్రెండ్ రేడియో జాకీ మహ్‌వశ్ డేటింగ్ చేస్తున్నట్లు కొంత కాలంగా వార్తలు వస్తున్నాయి. వాటికి ఆజ్యం పోస్తున్నట్టు మహ్‌వశ్ కూడా ఇండైరెక్ట్‌గా చాహల్‌పై పోస్టుల మీద పోస్టులు పెడుతోంది. ఇటీవల 'అతడే నాకు అన్నీ' అంటూ ఫ్యూచర్ హస్బెండ్ గురించి వీడియోలో చెప్పుకొచ్చిన ఈ చిన్నది తాజాగా మరో పోస్టు పెట్టింది. చాహల్ ఫొటోను షేర్ చేసి కితాబిచ్చింది. మంగళవారం కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ బౌలర్ అద్భుతంగా రాణించాడు. మ్యాచ్ అనంతరం చాహల్‌ను మెచ్చుకుంటూ మహ్‌వశ్ తన ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్ట్ చేసింది. అతడితో కలిసి దిగిన సెల్ఫీని షేర్ చేసి– "నీ టాలెంట్ మామూలుగా లేదు. అందుకే ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా గుర్తింపు సాధించావ్. అసంభవ్!" అని క్యాప్షన్ ఇచ్చింది. మహ్‌వశ్ చేసిన మహ్‌వశ్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట నెట్టింట వైరల్‌గా మారింది. ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లను చాహల్, మహ్‌వశ్ కలిసి చూశారు. దీంతో వీరు ప్రేమలో ఉన్నట్లు రూమర్స్ మొదలయ్యాయి. అయితే వీరిద్దరూ ఈ ప్రచారాన్ని తోసిపుచ్చారు. కాగా, ఈ మధ్య చాహల్ ఆడుతున్న మ్యాచ్‌లన్నింటికీ వచ్చి మహ్‌వశ్ గ్యాలరీలో సందడి చేస్తోంది. ఇటీవల కూడా మహ్‌వశ్ చాహల్‌ను ఉద్దేశిస్తూ పోస్ట్ చేసింది. అతడితో తీసుకున్న సెల్ఫీని పోస్ట్ చేసింది. దానికి "ఇది మీ వాళ్లకు అన్నివేళలా సపోర్ట్‌గా నిలుస్తూ, వారి వెనక స్ట్రాంగ్‌గా నిలుస్తున్నందుకు. మీకోసం మేమందరం ఉన్నాం" అని వ్యాఖ్య జోడించింది. దీనికి చాహల్ స్పందించాడు. "మీరు నా వెన్నెముక. నేను ఎంతో ఉన్నతస్థాయిలో నిలిచేందుకు సహకరిస్తున్న మీకందరికీ థ్యాంక్స్" క్యాప్షన్ జోడించాడు. దీంతో వీరి ప్రేమ బంధం నిజమేనేమో అంటూ నెటిజన్లు అనుకుంటున్నారు. ఇదిలా ఉండగా చాహల్ ఇటీవలే తన భార్య ధనశ్రీ నుంచి విడాకులు తీసుకున్నాడు.

## లక్నో టీమ్‌తో చేరిన
## స్పీడ్ స్టార్ మయాంక్




**లక్నో:** ఐపీఎల్ 2025 ఇంట్రెస్టింగ్‌గా సాగుతోంది. ఉత్కంఠభరిత మ్యాచ్‌లతో అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. హై స్కోరు మ్యాచ్‌లతోనే కాకుండా.. లో స్కోరింగ్ గేమ్‌లు కూడా ఫ్యాన్స్‌కు ఫుల్ కిక్ ఇస్తున్నాయి. ఇక ఈ సీజన్‌లో కొత్త కెప్టెన్ రిషబ్ పంత్ నాయకత్వంలో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ పర్వాలేదనిపిస్తోంది. ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడగా.. నాలుగు మ్యాచ్‌ల్లో గెలుపొందింది. 8 పాయింట్లతో పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానంలో ఉంది. ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే మిగిలిన 7 మ్యాచ్‌ల్లో కచ్చితంగా 8 విజయాలు సాధించాలి. గత మ్యాచ్‌లో చెన్నై చేతిలో ఓటమి పాలైన పంత్ సేన.. ఈ నెల 19న రాజస్థాన్ రాయల్స్‌తో సెకండాఫ్ పోరు మొదలు పెట్టనుంది. ఈ నేపథ్యంలోనే 156.7 %ఖవీూం% వేగంతో బౌలింగ్ చేసే ప్రమాదకరమైన భారత బౌలర్ జట్టులో చేరాడు. టీమిండియా సూపర్ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ లక్నో టీమ్‌లో చేరాడు. మయాంక్ రీఎంట్రీపై ఎల్ఎస్‌జీ అధికారికంగా వీడియో ద్వారా ప్రకటించింది. సోషల్ మీడియాలో వీడియోను షేర్ చేస్తూ.. 'మయాంక్ యాదవ్ ఈజ్ బ్యాక్' అనే క్యాప్షన్‌లో ఇచ్చింది. మయాంక్ వెన్నునొప్పి కారణంగా ఆటకు దూరంగా ఉన్నాడు. ఆ తరువాత కోలుకున్నా.. కాలి వేలికి మళ్లీ గాయం కావడం.. ఈ గాయం ఇన్‌ఫెక్షన్‌కు గురి కావడంతో రీఎంట్రీ మరింత ఆలస్యమైంది.

గతేగాది టీమిండియా తరుఫున అంతర్జాతీయ అరంగేట్రం చేసిన మయాంక్.. బంగ్లాదేశ్‌తో స్వదేశంలో జరిగిన మూడు టీ20 మ్యాచ్‌లలో ఆడాడు. ఆ తరువాత వెన్నునొప్పి కారణంగా దేశీయ సీజన్‌కు దూరమయ్యాడు. బెంగళూరులోని %దీజజ×% సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందాడు. మయాంక్ రీఎంట్రీపై లక్నో సూపర్ జెయింట్స్ కోచ్ జస్టిన్ లాంగర్ సంతోషం వ్యక్తం చేశాడు. మాయాంక్ ఇప్పుడు పరుగెత్తడం.. బౌలింగ్ చేయడం ప్రారంభించాడని.. ఇది భారత క్రికెట్, ఐపీఎల్ రెండింటికీ చాలా మంచి విషయమని అన్నారు. %చీజూ% లో మయాంక్ బౌలింగ్ వీడియో చూశానని.. అతను 90 నుంచి 95 శాతం ఫిట్‌గా కనిపించాడని చెప్పారు. ఈ సీజన్‌కు ముందు ఆటగాళ్ల గాయాలు లక్నో టీమ్‌ను బాగా దెబ్బ తీశాయి. మయాంక్ యాదవ్, మొహ్సిన్ ఖాన్, అవేష్ ఖాన్, ఆకాశ్‌దీప్ ఇలా అందరూ మొదట్లో గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే శార్దుల్ ఠాకూర్‌ను టీమ్‌లోకి తీసుకుంది. ఆ తరువాత అవేష్ ఖాన్, ఆకాష్ దీప్ గాయాల నుంచి కోలుకుని జట్టులో చేరారు. తాజాగా మయాంక్ యాదవ్ చేరికతో లక్నో బౌలింగ్ విభాగం మరింత బలంగా మారనుంది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌లో మయాంక్ యాదవ్ తుది జట్టులో ఉండడం ఖాయమే. గత సీజన్‌లో స్థిరంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేస్తూ.. వేగంగా వికెట్లు పడగొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

## పీఎస్ఎల్ వేస్ట్.. ఐపీఎల్ బెస్ట్

### ఇంగ్లాండ్ ఆటగాడు సామ్ బిల్లింగ్స్




**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) 2025 భారత్‌లో జరుగుతుండగా.. పీఎస్ఎల్(పాకిస్తాన్ సూపర్ లీగ్) 2025 పా కిస్తాన్‌లో జరుగుతోంది. ఐపీఎల్ ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా మా రింది. అయితే పాకిస్థాన్ ఆటగాళ్లు పాకిస్తాన్ సూపర్ లీగ్‌ను తరచుగా ఐపీఎల్‌తో పోల్చుతున్నారు. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో ఆడుతున్న ఇంగ్లాండ్ ఆటగాడు సామ్ బిల్లింగ్స్‌ను కూడా ఇలాంటి ప్రశ్నే అడిగారు. ఆ సమయంలో ఇంగ్లాండ్ ఆటగాడు సామ్ బిల్లింగ్స్ తగిన సమాధానం ఇస్తూ పాకిస్తానీ జర్నలిస్టు నోరు మూయించాడు. పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025లో లాహెూర్ ఖలందర్స్ తరపున సామ్ బిల్లింగ్స్ ఆడుతున్నాడు. అయితే విలేకరుల సమావేశంలో ఐపీఎల్ వర్సెస్ పీఎస్ఎల్ గురించి అడిగినప్పుడు.. ఆశ్చర్యకరమైన సమాధానం చెప్పి పాక్ మీడియా నోరు మూయించాడు. ఎవరు ఏమి చెప్పినా తాను తన వైఖరికే కట్టుబడి ఉంటానని.. ప్రపంచంలోని ఏ ఇతర టీ20 లీగ్ కూడా ఐపీఎల్ కు సమానంగా ఉండదన్నాడు. తాను తెలివతక్కువగా ఏదైనా చెప్పాలనుకుంటున్నారా? అని బిల్లింగ్స్ అడిగాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ టోర్నమెంట్ గా ఐపీఎల్ ను విస్మరించడం కష్టమని చెప్పాడు. ఇది చాలా స్పష్టంగా ఉందని.. అనవసరంగా ఈ ప్రశ్న అడగడంలో అర్థం లేదన్నాడు. ప్రపంచంలో ఏ టోర్నమెంట్ అయినా ఐపీఎల్ తర్వాతేనని సామ్ బిల్లింగ్స్ స్పష్టం చేశాడు. పీఎస్ఎల్ ను ఐపీఎల్ తో పోల్చలేమని చెప్పాడు. ఇప్పటికే చాలా మంది క్రికెటర్లు పాకిస్తాన్ మీడియా ముందే ఐపీఎల్ మెరుగ్గా ఉందని ప్రకటించారు. కానీ పాకిస్తాన్ జర్నలిస్టులు భారత్ ను చర్చలోకి లాగడం ద్వారా ఐపీఎల్ ను తక్కువ చేసి వార్తలను సృష్టించడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ పదేపదే విఫలమైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల కరాచీ కింగ్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ ను ఓ పాకిస్తాన్ జర్నలిస్ట్ ఓ ప్రశ్న అడిగారు. ఐపీఎల్ లో అమ్ముడుపోకుండా పీఎస్ఎల్ లో ఆడినందుకు భారత ఫ్యాన్స్ నుంచి ఎంత ద్వేషం వచ్చిందని అడిగాడు. దానికి సమాధానమిస్తూ.. నేను దీని గురించి వినడం ఇదే మొదటి సారి అంటూ సమాధానమిచ్చాడు. మంగళవారం పీఎస్ఎల్ 2025లో భాగంగా లాహెూర్ ఖలందర్స్. కరాచీ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో లాహెూర్ ఖలందర్స్ 65 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన లాహెూర్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. లాహెూర్ ఖలందర్స్ తరపున బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఫఖర్ జమాన్ 76 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఇది కాకుండా, డారిల్ మిచెల్ 75 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో సామ్ బిల్లింగ్స్ 19 పరుగులు చేశాడు. 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కరాచీ కింగ్స్ 19.1 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. కరాచీ కింగ్స్ తరపున బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఖుష్దిల్ షా 39 పరుగులతో భారీ స్కోరర్ గా నిలిచాడు. లాహెూర్ ఖలందర్స్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది, రియాద్ హుస్సేన్ తలో 3 వికెట్లు పడగొట్టారు.



## లీగ్ చరిత్రలో పంజాబ్ రికార్డుల మోత

**ముంబై:** ఐపీఎల్లో పంజాబ్ కింగ్స్ మంగళవారం కమాల్ చేసింది. 111 పరుగులు చేసినా కూడా విజయం దక్కించుకుని ఔరా అనిపించింది. బంతికో పరుగు చేసిన ఇంకా 8 బంతులు మిగిలి ఉండే అతి చిన్న టార్గెట్ ను కూడా కాపాడుకుంది. ముఖ్యంగా చిన్న పాటి టార్గెట్ ను కాపాడుకోడానికి తన బౌలర్లను కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వాడుకున్న తీరు, వారిలో ఉత్సాహాన్ని నింపిన తీరు మాటలకందనిది. ఇదే జట్టు అంతకముందు సన్ రైజర్స్ తో జరిగిన మ్యాచ్ లో 245 పరుగుల టార్గెట్ ను కాపాడుకోలేక 8 వికెట్లతో ఓడిపోయింది. అయితే కోల్ కతా నైట్ రైడర్స్ పై మాత్రం తమ జూలు విదిల్చింది. కేవలం 111 పరుగులను డిఫెండ్ చేసుకుని లీగ్ చరిత్రలో ఈ ఘనత సాధించిన జట్టుగా నిలిచింది. అయితే ఆశ్చర్యకరంగా కేకేఆర్ పైనే మరో రికార్డును కూడా పంజాబ్ కలిగి ఉంది. ఐపీఎల్లోనే కాకుండా టీ20 చరిత్రలోనే అత్యధిక పరుగుల ఛేదన రికార్డు కూడా పంజాబ్ పేరిటే ఉంది. గతేడాది కేకేఆర్ పై 262 పరుగులను ఛేజ్ చేసి రికార్డుల్లోకి ఎక్కింది. ఈ మ్యాచ్ ను తలుచుకుంటే క్రికెట్ అభిమానులకు ఇప్పటికీ ఒళ్లు పులకరిస్తుంది. ఈ మ్యాచ్ కు ముందు కేవలం 8 మ్యాచ్ ల్లో రెండు విజయాలతో ఉన్న పంజాబ్.. కేకేఆర్ పై తన జూలు విదిల్చింది. ఈడెన్ గార్డెన్స్ లో జరిగిన ఈ మ్యాచ్ లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కేకేఆర్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 261 పరుగుల భారీ స్కోరు చేసింది. ఫిల్ సాల్ట్ (75), సునీల్ నరైన్ (71) ఆకాశమే హద్దుగా చెలరేగారు. మరొక జట్టైతే ఈ భారీ స్కోరును చూసి బెంబేలెత్తిపోయేది. అయిత విజయమో, వీర స్వర్గమో అన్నట్లుగా చెలరేగిన పంజాబ్.. మరో ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే, 8 వికెట్లతో ఈ టార్గెట్ ను ఛేజ్ చేసింది. ముఖ్యంగా జానీ బెయిర్ స్టో (108) సెంచరీతో కదం తొక్కగా, ప్రభు సిమ్రాన్ (54), శశాంక్ సింగ్ (68) విరోచిత ఫిఫ్టీలతో జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. ఇక తాజా సీజన్ కు వచ్చే సరికి మరో రకంగా కేకేఆర్ కు పంజాబ్ చుక్కలు చూపించింది. ఈ సీజన్ లో అంతంతమాత్రంగానే రాణించిన యుజ్వేంద్ర చాహల్.. ఈ మ్యాచ్ లో తన మాయను ప్రదర్శించాడు. గింగరాలు తిరిగే బంతులు వేసి, కేకేఆర్ కు చుక్కలు చూపించాడు. న్యూ చండీగఢ్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ కేవలం 15.3 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌటయ్యింది. ఓపెనర్ ప్రభు సిమ్రాన్ సింగ్ (15 బంతుల్లో 30, 2 ఫోర్లు, 3 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో హర్షిత్ రాణా మూడు వికెట్లతో రాణించాడు. ఇక ఛేజింగ్ లో డిఫెండింగ్ చాంపియన్ కేకేఆర్ 15.1 ఓవర్లలో 95 పరుగులకు కుప్పకూలింది. మిడిలార్డర్ బ్యాటర్ అంగ్ క్రిష్ రఘువంశీ (37) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. యజ్వేంద్ చాహల్ నాలుగు, మార్కో యన్సెన్ మూడు వికెట్లతో రాణించారు. ఇక గతేడాది పంజాబ్ చేతిలో ఓడిన కేకేఆర్ కి కెప్టెన్ గా శ్రేయస్ అయ్యర్ ఉండగా.. ఈ ఏడాది పంజాబ్ కెప్టెన్ గా శ్రేయస్ పగ్గాలు చేపట్టి, కేకేఆర్ పైనే మరుపురాని విక్టరీని సాధించడం కొసమెరుపు.


# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

8 | కరీంనగర్ | గురువారం 17 ఏప్రిల్ 2025








# పవన్ యాక్షన్ సీన్స్

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు' క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమాపై జ్యోతికృష్ణ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను రూపొందించే బాధ్యత పవన్ కల్యాణ్ తీసుకున్నారు. ఈ సినిమాలో మొత్తం ఆరు యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. 20 నిమిషాలపాటు- ఉండే ఒక దాన్ని పవన్ రూపొందించారు. ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఈ సీక్వెన్స్‌లో 1100 మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో 61 రోజులు దీన్ని చిత్రీకరించాం. దీని కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. గ్రౌండ్ వర్క్ చేశారు. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్లతో చర్చించారు. సినిమా మొత్తంలో ఇదే హైలైట్ కానుందని తెలిపారు. ఇక ఈ సినిమా కోసం ఆయన ప్రత్యేకంగా గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నట్లు జ్యోతికృష్ణ తెలిపారు. ఇందులో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటిస్తోన్న విషయం తెలిసిందే. ఆమె కూడా ఇటీ-వల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ సినిమాలోని ప్రతి అంశంలో పవన్ భాగమయ్యారని తెలిపారు. రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి భాగం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో మే9న ప్రేక్షకుల ముందుకు రానుంది.

బంధం బలంగా ఉండాలంటే..

# ఒంటరితనం రావద్దు

**రష్మిక హాట్ కామెంట్స్**


ప్రజంట్ బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ లో బాగా వినిపిస్తున్న పేరు రష్మిక మందన. సక్సెస్‌లతో దూసుకపోతున్న ఈ ముద్దుగుమ్మ క్షణం తీరిక లేకుంగా వరుస షూటింగ్‌లతో బిజీగా ఉంది. బాలీవుడ్‌లో క్రేజీ స్టార్‌గా మారిపోయిన రష్మిక.. ఆయుష్మాన్ ఖురానా తో 'థామా' అనే చిత్రంలో బిజీగా ఉంది. ఇది హారర్ మూవీ కావడంతో గత కొన్ని రోజుల నుంచి నైట్ షూట్ అంటూ తిరుగుతోంది. ఇక మూవీస్ విషయం కాస్త పక్కన పెడితే. రౌడి హీరో విజయ్, రష్మిక ఇద్దరు డేటింగ్‌లో ఉన్నారన్నే వార్తలు ఎప్పటి నుంచో వింటున్నాం. చాలా సార్లు వీరిద్దరు మేము జస్ట్ ఫ్రెండ్ అని చెప్పిన.. ఏ వెకేషన్‌లకు వెళ్లినా ఇద్దరు కలిసే వెళతారు. ఇద్దరూ ఒకే చోట ఉంటారు.. కానీ వేర్వేరు ఫొటోలను షేర్ చేస్తుంటారు. అయితే తాజాగా రష్మిక రిలేషన్ షిప్ గురించి ఓ పోస్ట్ పెట్టింది.. రష్మిక కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు ఆమెకు సంబంధించిన ప్రతి ఒక అప్ డేట్ అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఇందులో భాగంగా తాజాగా 'రిలేషన్ స్ట్రాంగ్‌గా ఉండాలంటే పాటించాల్సిన రూల్ ఏంటో తెలుసా? ఎప్పుడూ ఏ క్షణం అయినా సరే ఒంటరిగా బాధపడే రోజు రాకుండా చూసుకోవాలి.. కష్టసుఖాల్లో ఇద్దరూ ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ చేయి విడవద్దు అనే రూల్ పెట్టుకుంటే చాలు' అని ఎక్కడో వచ్చిన ఓ పోస్ట్‌ను, తన ఇన్ స్టా స్టోరీలో షేర్ చేసింది. అంతే కాదు రూల్‌ని నేను కూడా నేను కూడా అంగీకరిస్తున్నా.. ఒప్పుకుంటున్నా' అని రష్మిక రాసుకొచ్చింది.





# స్పిరిట్ సెట్స్‌లోకి ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఏడాది చివరిలో 'స్పిరిట్' సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది. ప్రభాస్ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన తర్వాతే సందీప్ రెడ్డి స్పిరిట్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తుంది. స్పిరిట్ షూటింగ్ మొత్తం 120 రోజులకు పైగా జరగనుందని, అందులో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని సమాచారం. ఈ సినిమా కోసం ప్రభాస్ జిమ్‌లో తీవ్రంగా వర్కవుట్ చేస్తూ కొత్త లుక్‌ను సిద్ధం చేస్తున్నారట. ఇప్పటివరకూ చూడని ప్రత్యేకమైన లుక్‌లో ఆయన ఈ చిత్రంలో కనిపించనున్నట్లు- తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా అమెరికాలో జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ సినిమా షూటింగ్‌ను మెక్సికోలో జరుపబోతున్నట్లు ప్రకటించాడు. ఇంతకంటే ఏం అప్‌డేట్ ఇవ్వలేమని తెలిపాడు. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఏ వార్త అయినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఈ షెడ్యూల్‌లో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని టాక్. తన లుక్ కోసం జిమ్‌లో వర్క్‌వుట్ చేయనున్నారట. ఇందులో ప్రభాస్ ఇప్పటివరకూ చూడని లుక్‌లో కనిపించనున్నట్లు- సమాచారం. తాజాగా యూఎస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సందీప్ వంగా మాట్లాడుతూ దీని షూటింగ్ అప్‌డేట్ పంచుకున్నారు.




# అరుంధతి, అమ్మోరు లాంటి సినిమా

**ఓదెల-2పై శర్వానంద్ ఆసక్తికర కామెంట్స్**

'ఓదెల 2' టీ-జర్ చూడగానే 'అరుంధతి', 'అమ్మోరు' సినిమాలు చూసిన అనుభూతి కలిగింది. ఏదో మ్యాజిక్ జరగనుందనే నమ్మకం నాకుందని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఆయన ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'ఓదెల 2' ప్రీరిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమన్నా ప్రధాన పాత్రలో సంపత్ నంది సూపర్ విజన్‌లో రూపొందిన పాన్ ఇండియా చిత్రమిది. అశోక్ తేజ దర్శకత్వం వహించారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానున్న నేపథ్యంలో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ.. 'సంపత్ నందితో ఏడాదిగా కలిసి ప్రయాణిస్తున్నా. ఆయనొక అడిక్షన్. తమన్నా ఆయనతో నాలుగు చిత్రాలు చేశారంటే మామూలు విషయం కాదు. నాకు ఆమెను హీరోయిన్ అని పిలవడం ఇష్టం లేదు. తనొక అద్భుతమైన ఆర్టిస్ట్. రెండు దశాబ్దాలుగా కథానాయికగా కొనసాగడం మామూలు విషయం కాదు. ఒక మాస్ సినిమా కోసం ప్రేక్షకులు ఎలా అయితే ఎదురు చూస్తారో.. 'ఓదెల 2' కోసం అంతే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్ర ఓపెనింగ్స్ అదిరిపోతాయని నేను బలంగా నమ్ముతున్నా. టీజర్, -ట్రైలర్స్ నాకు బాగా నచ్చాయి. అందరూ కలిసి చాలా మంచి సినిమా చేశారు. ఈ వేసవికి ఇదే బ్లాక్‌బస్టర్ అవుతుందని నా నమ్మకం అన్నారు. ఈ సినిమా, శివశక్తి పాత్ర నా కెరీర్‌లో చాలా ప్రత్యేకం అని తమన్నా అన్నారు. ఈ చిత్రంలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నా. తప్పకుండా ఇది అందరికీ నచ్చుతుంది. మీ స్పందన కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా అంది.

# చిత్రసీమలో ఏఐ వినియోగం

**- దిల్ రాజు**

టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన దిల్ రాజు సినీ రంగంలో మరో వినూత్న ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నాడు. క్వాంటం ఏఐ గ్లోబల్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మీడియా కంపెనీని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త వెంచర్ ద్వారా సినీ రంగంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో మే 4న కంపెనీ పేరు సహా పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. ఈ ప్రకటనను దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధికారికంగా విడుదల చేసింది, ఈ సందర్భంగా ఓ వీడియోను కూడా షేర్ చేశారు. ఈ కొత్త కంపెనీ వినోద రంగానికి ప్రత్యేకంగా రూపొందించిన అధునాతన ఏఐ సాధనాలను అభివృద్ధి చేసి అందించనుంది. దిల్ రాజు ఈ సహకారం గురించి మాట్లాడుతూ, సినిమా నిర్మాణంలో ఏఐ సాంకేతికత ద్వారా కొత్త అవకాశాలను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు.

డ్రగ్స్ అలవాటున్న

# వారితో నటించను

డ్రగ్స్ అలవాటున్న హీరోలతో ఇకముందు నటించకూడదని మళయాల నటి విన్సీ సోనీ అలోషియస్ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసు కున్న నటి విన్సీ ఈ విషయం చెప్పారు. ఒక సినిమా సెట్స్‌లో హీరో తనతో అసభ్యకరంగా ప్రవ ర్తించాడని తెలిపారు. అయితే అతడి పేరును మాత్రం విన్సీ వెల్లడించలేదు. సినిమా షూటింగ్ సమయంలో ఆ హీరో డ్రగ్స్ తీసుకున్నాడు. నాతో అనుచితంగా ప్రవర్తించాడు. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు ఎంతో ఇబ్బందిపడ్డా. తన ముందే దుస్తులు మార్చుకోమని ఇబ్బందిపెట్టాడు. అందరి ముందే ఇలాంటి మాటలు మాట్లాడేవాడు. నా జీవితంలో ఇది ఒక అసహ్యకరమైన సంఘటన. దీని తర్వాత ఇక డ్రగ్స్ అలవాటు ఉన్న నటులతో నటించకూడదని నిర్ణయించు కున్నాను. నేను తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బహుశా భవిష్యత్తులో నాకు సినిమాల్లో ఎక్కువ అవకాశాలు రాకపోవచ్చు. కానీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను. ఈ వ్యసనం ఉన్న వారితో నేను నటించను. నాతో అలా ప్రవర్తించిన నటుడి గురించి అందరికీ తెలుసు కానీ ఎవరూ స్పందించలేదు. డ్రగ్స్ తీసుకోవడం అతడి పూర్తి వ్యక్తిగత విషయం కావచ్చు.. కానీ, వృత్తిపరమైన వాతావరణంపై అది ప్రభావం చూపకూడదు.



- మళయాల నటి విన్సీ సోనీ అలోషియస్


Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**